సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 11 - ఆదివారం 17 జూలై, 2016 సంపుటి : 1 సంచిక 42 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00



## ప్రజల మనోభావాలు పరిరక్షించాలి





విజయవాడలోని ఇటీవల కూల్చివేసిన దేవాలయాలు

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥
ఓ భారతా ! (అర్జునా) ధర్మమునకు హాని కలిగినప్పుడును, అధర్మము పెచ్చు పెరిగిపోవుచున్నప్పుడును నన్ను నేను సృజించుకొందును. అనగా సాకారరూపముతో ఈ లోకమున అవతరింతును.

### ధర్మాన్ని కాపాడాలి - ధరలు తగ్గించాలి

**విజయవాడ (రాజధాని వార్తలు ప్రత్యేక ప్రతినిధి) :** యధాయధాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత అభ్యుద్ధామం ...ఎప్పుడెప్పుడు ధర్మము నశిస్తుందో అప్పుడప్పుడు నేను అవతరిస్తాను... రాజ్యాన్ని పరిపాలించే రాజు ప్రజల మనోభావాలకు అనుగుణంగా వ్యవహరించాలి. ప్రజాసమస్యలు వేగుల ద్వారా తెలుసుకుని అందుకు పరిష్కార మార్గాలను అన్వేషించాలి. మొత్తంమీద ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం కావాలి. తమ పాలన భేష్ అనుకుంటే సరిపోదు. అది ప్రజలు నిర్ణయించాలి. ప్రజాతీర్పును శిరసావహించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అనేక సంఘటనలు చూస్తుంటే కొంత ఆందోళన కలగక మానదు. నూతన రాజధాని ప్రాంతంతో సహా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల్లో కొంత అలజడి, ఆందోళన, అభద్రతాభావం చోటుచేసుకుంటోంది. రోడ్ల వెడల్పు పేరుతో, సుందరీకరణ పేరుతో ప్రజల బ్రతుకు జీవనాన్ని ఛిద్రం చేస్తున్నారనే భావన సర్వత్రా నెలకొంది. అంతేకాకుండా కొన్ని తరాలుగా ప్రజలు తమ ఇష్ట దైవానికి పూజలు, పునస్కారాలు చేసుకుంటూ, ఉత్సవాలు చేసుకుంటూ ఆధ్యాత్మిక భక్తిభావాలను పెంపొందించుకుంటున్నారు. అయితే రాజధాని నగర కేంద్రమైన విజయవాడలో ఇటీవల పెద్ద సంఖ్యలో హిందూ దేవాలయాలను కూల్చివేసిన సంఘటన తీవ్ర సంచలనం కలిగించింది. అందరికీ ఆవేదన మిగిల్చింది. అందులో కొన్ని ప్రాంతాల్లో మసీదులను కూడా కూల్చారు. మరికొన్ని మందిరాలను కూల్చడానికి ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. దేవాలయాలను ప్రభుత్వ అవసరాల కోసం కూల్చివేయాలనుకుంటే స్థానిక భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకున్నట్లయితే ఎవరికీ ఇబ్బంది ఉండేదికాదు. ఆ దేవాలయాలను తొలగించే సమయంలో పూజలు చేసుకుని, సంప్రోక్షణలు జరిపి శాస్త్రోక్తంగా దగ్గరుండి వారే తొలగించేవారు. కానీ పోలీసు వలయంలో రాత్రికి రాత్రి దండయాత్ర

➤ మిగతా 2లో..






పట్టిసీమకు పూజ చేసి ప్రారంభోత్సవం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## పథకాలతో పరుగులు

- సమన్వయానికి పదిమంది ముఖ్య నేతలతో కమిటీ
- ఎమ్మెల్యేల పనితీరు అంతా తెలుసు
- పార్టీ సమీక్షలో అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి



**విజయవాడ (రాజధాని వార్తలు ప్రత్యేక ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల కన్నా అత్యధికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అయితే వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్ళడంలో కొన్ని లోపాలు కనిపిస్తున్నాయని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభిప్రాయపడ్డారు. ఇటీవల ఉండవల్లిలోని ఆయన నివాసంలో జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన నిక్కచ్చిగా తన అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాల అమలులో కొన్ని నియోజకవర్గాలు ముందుండడం, మరికొన్ని వెనుకబడి ఉండడానికి గల కారణాలు ఏమిటని ఆయన నాయకులను ప్రశ్నించారు. పార్టీలో సమన్వయం ఉండాలని, పార్టీ, ప్రభుత్వం జోడు గుర్రాల్లా పయనించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజల్లో పార్టీ కార్యక్రమాలపట్ల, ప్రభుత్వ చర్యలపట్ల సానుకూలత ఉన్నప్పటికీ కొందరు నాయకులు కారణంగా ఇంకా పూర్తిస్థాయిలో సంతృప్తిగా లేదని అంటున్నారు. దీనిని సమన్వయం చేయడానికి 10 మంది ముఖ్యనాయకులతో కమిటీ వేస్తున్నానని ఆయన చెప్పారు. ప్రతినెలా జిల్లా స్థాయిలో పార్టీ శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ముఖ్య నాయకులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఆ జిల్లాలకు చెందిన మంత్రులు విధిగా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొనాలని చంద్రబాబు సూచించారు. అభివృద్ధి,

➤ మిగతా 2లో..

## గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



- రోజుకు 10 నుంచి 12 గంటలు విధుల నిర్వహణ
- నెలకు రూ.6 నుంచి 10,000లు. మాత్రమే చెల్లింపు

**రాజధాని, ప్రతినిధి- రాయపూడి :** గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆల్‌ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.వి.రావు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. తుళ్ళూరు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం యూనియన్ ఆధ్వర్యంలో తపాలా ఉద్యోగులు పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపూడి గ్రామంలో నిర్వహించిన పాదయాత్రలో బివి.రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 1.30 లక్షల పోస్టాఫీసులు గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నా యన్నారు. పట్టణ ప్రాంతాల్లో కేవలం 24 వేలు మాత్రమే పోస్టాఫీసులు ఉన్నాయని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే సిబ్బంది 10 నుంచి 12 గంటల పాటు పని చేస్తున్నప్పటికి వీరికి నెలకు రూ.6,000 నుంచి 10,000 మాత్రమే వేతనము ఇస్తున్నారని చెప్పారు.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అద్దె, సెలవులు, పెన్షన్, భత్యం,వైద్యం లాంటి తమకు కల్పించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో పదోన్నతుల్లో అన్యాయం జరుగుతోందని వాపోయారు.పది సంవత్సరాల ఒకసారి నియమించే పే కమిటీ పరిధిలోకి గ్రామీణ తపాలా ఉద్యోగులను తీసుకోవాలని కోరితే తిరస్కరించి, కమలేష చంద్ర కమిటీని నియమించడం జరిగిందన్నారు. తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ దృష్టికి తీసుకొచ్చేందుకు జూన్ 12వ తేదీన శ్రీకాకుళం జిల్లా నుంచి గ్రామీణ తపాల ఉద్యోగుల చైతన్య రథం కదిలి వస్తోందన్నారు. రాష్ట్రంలో 23 జిల్లాల్లో పర్యటించి ఆగష్టు 15 నాటికి పాద యాత్ర ముగించి అనంతరం విజయవాడలో సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కార్యదర్శి డివి.అప్పారావు, డివిజనల్ ప్రెసిడెంట్ కె.భూపేష్ బాబు, ఐక్య వేదిక అధ్యక్షులు డి.యస్.యన్.రావు, యమ్. వెంకటేశ్వరరావు, ఆర్ వి. రామకృష్ణ, బి. శివరామరెడ్డి (రాయపూడి), బి.సావిత్రమ్మ(మందడం), కె.సుబ్బా రావు, యస్.కె.సిద్ధావళి (తుళ్ళూరు) పాల్గొన్నారు.



రంజాన్ పండగ సందర్భంగా ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు


### ఈవారం రాజధాని

- రూ.251 ఫ్రీడమ్స్ స్మార్ట్ ఫోన్‌లు అమ్మకం ప్రారంభం
- సీఎం చంద్రబాబు 14వ తేదీవరకు రష్యాలో పర్యటన
- ఫసల్ బీమాలో వేరుశేనగ పంటలు చేర్చాలి: రైతు సంఘ నాయకులు
- నెల్లూరులో దారుణం పట్టపగలే దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఇద్దరి హత్య
- ప్రభుత్వం కొనుగోలు చేసిన ట్యాబ్ రూ. 60 లక్షలు కుంభకోణం
- ఢిల్లీపై లోకేష్ గురి
- 'గడపగడప'కు వైఎస్ఆర్ సీపీకి భారీ స్పందన
- రాజధానిలో 'రాజన్న' జయంతి వేడుకలు
- తుళ్ళూరులో ఉపందుకున్న వాకింగ్ ట్రాక్ పనులు
- మురుగు ముంపు నుంచి డెల్టాకు రక్షణ: ఏసుబాబు కార్యనిర్వాహక ఇంజనీర్

ముస్తాబవుతున్న కృష్ణమ్మ 7లో

ప్రజాహితమే పరమావధిగా దేవినేని 2లో







# రాజధాని వార్తలు

కలం

## అగ్రదేశాల వల్లే ఉగ్రవాదం

శాస్త్ర సాంకేతికతో ముందుకు వెళుతున్న అగ్రదేశాలు వనరుల కోసం చిన్నదేశాలను చిత్తుచేశాయి. ఆయ దేశాల్లో అసమ్మతిని, ఉగ్రవాదాన్ని పెంచి పోషించాయి. తమ శాస్త్ర సాంకేతికను సొమ్ముచేసుకుంటూ మధ్య ప్రాచ్యదేశాల్లోని ముడి చమురును కారుచౌకగా కొట్టేశాయి. అందుకు ఎదురు తిరిగిసిన ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ వద్ద అణ్యాస్త్రాలు, మారణాయుధాలు ఉన్నాయని, వాటిని పరిశీలించాలని, అందుకు సహకరించకపోతే యుద్ధం చేయాలని అగ్రరాజ్యాల కూటమంతా యుద్ధం ప్రకటించాయి. సద్దాంను ఉరితీశాయి. వారికి అనుగుణమైన వారితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు సహజవనరులు సమృద్ధిగా ఉన్న దేశాలన్నింటిలోనూ అదే బలప్రయోగంతో మరుభూమిగా మార్చారు. ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని సామాన్య ప్రజలు ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని ఓడలెక్కి రవాణాకు ఉపయోగించే కంటెయినర్లలో దాక్కుంటూ పసిపిల్లలతో దేశసరిహద్దులు దాటే ప్రయత్నంలో మృత్యు ఒడిలోకి చేరుతున్నారు. ఇప్పటికే అనేక దేశాలు కాందిశీకులను తరిమి కొడుతున్నాయి. ఒకప్పుడు సమృద్ధిగా, ఆయా దేశాల్లో సౌభాగ్యంగా ఉన్న ప్రజలను ఈ హృదయవిదారకు పరిస్థితికి లోను చేసింది ఈ అగ్రదేశాలే కదా...తమ పరిస్థితికి కారణమైన దేశాల అంతు పట్టాలనే లక్ష్యంతోనే ఉగ్రవాద సంస్థలు వెలిశాయి. బిన్‌లాడెన్ ఆధ్వర్యంలో అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూల్చివేతకు పాల్పడినప్పుడే తెలిసింది, తాము రాజేసిన ఉగ్రవాదం తమవరకు వచ్చిందని అగ్రదేశాలు గుర్తించాయి. ఇప్పుడు ఏ క్షణం ఏ దేశంలో ఎక్కడ ఉగ్రవాదులు దాడి చేస్తారో అని ప్రపంచం గడగడలాడుతోంది. నిజానికి మానవాళి ఉగ్రవాదం మాటును పెను సవాలు ఎదుర్కొంటుంది... ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాదాన్ని నిరశిస్తున్నాయిగాని, ఈ పరిస్థితికి మూల కారణం ఏమిటని ఇప్పటికీ ఎందుకు ఆత్మ విమర్శ చేసుకోలేకపోతున్నాయి? ఆధిపత్యం, అహంకారధోరణులనే ఇంకా ఎందుకు కొనసాగిస్తున్నాయి. నిజానికి చేతివేళ్ల మీద లెక్కపెట్టేంత మంది ప్రపంచ నాయకుల వల్లే ఈ పరిస్థితి దాపురించింది. ఏ దేశ ప్రజలు మరొక దేశ ప్రజల్ని ఇబ్బంది పెట్టడానికి, యుద్ధం పేరిట చంపటానికి ఒప్పుకోరు. కాని ఆయా దేశాల నాయకుల వల్ల మరొక దేశ ప్రజలు, ఉగ్రవాదుల వల్ల అగ్రరాజ్య సామాన్యులు ఈనాడు తల్లడిల్లు తున్నారు. శాంతి ఉన్న చోట యుద్ధానికి చోటుండదు. యుద్ధానికి చోటుచేసుకుంటే శాంతి మాయమవుతుంది. ఇది ప్రస్తుత పరిస్థితి. ఒక వర్గానికి చెందిన ప్రజలంటే ప్రపంచం ముందు దోషులుగా నిలవవలసి వస్తోంది. అనుమానపు చూపులతో వారిని వేధిస్తుంటారు. నిజానికి అతికొద్ది మంది చేసే ఈ ఉగ్రవాదం వల్ల చెంప్పదెబ్బ, గోడదెబ్బ తగిలినట్లు ఆ వర్గం ప్రజలు తమ వారి నుంచి, ప్రపంచ దేశాలనుంచి అవమానాలు ఎదుర్కొంటూ నిలువునా కృంగి పోతున్నారు. ఈ సృష్టిలో పుట్టుక, గిట్టుక మధ్య జీవితం అత్యల్పం. దీన్ని బలహీన దేశాలపై పెత్తనానికి, లేదా అధి నాయకులకు గుణపాఠం చెప్పాలన్న మిషతో సామాన్య ప్రజలపై దాడికో వినియోగించడం అత్యంత బాధాకరం. అతి పవిత్ర రోజులైన రంజాన్ ఉపవాస దినాల్లో అదే ముస్లింలు తమ వారిపై దాడులకు తెగించడంలో విజ్ఞత ఎంతో ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. రంజాన్ సందర్భంగా శాంతిని పెంపొందించాల్సింది పోయి, ప్రపంచంలోనే అతి పవిత్రమైన మహ్మద్ ప్రవక్త సమాధిగా చెబుతున్న మదీనా మసీద్‌పై దాడి చేయడం ఎంత దౌర్భాగ్యం..మనిషి జీవిత విలువలు తెలసుకోవాలి. అదే సమయంలో జీవితం ఎంత క్షణభంగురమో గుర్తించాలి. జీవితాన్ని జీవిం చడానికి, జీవింపచేయడానికి మాత్రమే ఉపయోగించాలి. ఈ ప్రపంచాన్ని శాంతి సౌభాగ్యాలతో కొనసాగించాలి. అణచివేత, విధ్వంసం నుంచి తిరుగుబాటు వస్తుందన్న సామాన్య సూత్రాన్ని అగ్రదేశాలు గుర్తించాలి. మానవులంతా సహజీవంతో, శాంతియుతంగా మనుగడ సాధించాలి. అందుకోసం ప్రస్తుత పరిస్థితిలో మార్పు రావాలి. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. రానున్న తరాలకు శాంతికరమైన ప్రపంచాన్ని వారసత్వంగా అందించాలి.

# ప్రజాహితమే పరమావధిగా దేవినేని



**దేవినేని ఉమామహేశ్వరరావు**
**మైలవరం శాసనసభ్యులు,**
**భారీనీటి పారుదల శాఖామంత్రి**

పార్టీ ఆశయాలను అమలుపరచటం, కార్యకర్తలకు ఆదుకోవడం, అధిష్టానం మెప్పు పొందటం,పదవులకోసం వెంపర్లాడక పోవటం లాంటి సుగుణాల నిధి దేవినేని ఉమామహేశ్వరరావు. ఆ సుగుణాలే ఆయనకు మంత్రి పదవిని కట్టబెట్టాయని ప్రత్యర్ధులు సైతం కొనియాడుతుంటారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటికి ఉమామహేశ్వరరావు విద్యార్థి అయినా, పార్టీ జెండా మోస్తూ, కార్యకర్తలను సమకూర్చుకోవటంలోను, ఉత్సాహపరచటంలోనూ ముందుండేవారు. ఒక విధంగా చెప్పాలంటే ఉమా అన్నచాటు బిడ్డ, సోదరుడు వెంకటరమణ పశ్చిమకృష్ణాలో తెలుగుదేశం పార్టీలో కీలక వ్యక్తిగా కొనసాగటమేకాక,1994లో నందిగామ నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో విద్యాశాఖమంత్రిగా కొనసాగుతూ,రైలు ప్రమాదంలో మరణించారు. ఉమ ప్రత్యక్ష రాజకీయ ప్రవేశాలకు ఆ దుర్ఘటన కారణమైంది. 1999 లో నందిగామ నియోజక వర్గం నుంచి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేయటం, విజయం సాధించటం జరిగాయి. 2004 ఎన్నికల్లో కూడా ఆ నియోజకవర్గం ఓటర్లు, ఉమాను అభిమానించి గెలిపించారు. నందిగామ నుంచి ఉమ హ్యాట్రిక్ సాధిస్తాడని అభిమానులు అభిప్రాయపడుతున్న తరుణంలో ఊహించని మార్పులు చోటు చేసుకున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనలో నందిగామ నియోజక వర్గం షెడ్యూల కులములకు కేటాయించటంతో ఉమ మరో నియోజక వర్గం వెదుక్కోక తప్పలేదు. పార్టీ ఆశయాలను, లక్ష్యాలను చిత్తశుద్ధితో అమలు పరచే ఉమకు మైలవరం నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. చంద్రబాబు నాయుడు. భారీ మెజారిటీతో ఉమ విజయం సాధించారు. మూడుసార్లు విజయ సాధించిన, 10 ఏళ్ళ పాటు ప్రతి పక్షనేతగానే గడిపారు. ఆ ప్రతిపక్షనేతగా రాజకీయాల్లో రాటుదేలటానికి, ప్రజల పక్షాన నిలిచి పోరాటంచేయటానికి ప్రతిపక్ష పాత్ర పోషించారు.

సుదీర్ఘకాలం శాసనసభ్యునిగా కొనసాగుతూ, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపిస్తూ, అధికారపార్టీ నేతలతో ప్రత్యక్ష, పరోక్ష పోరాటాలు జరుపుతూ, పార్టీ పటిష్టతక్కూడా అహర్నిశలు శ్రమించారు. ఉమామహేశ్వరరావు. నందిగామ శాసనసభ్యునిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా కార్యదర్శి పదవిని కూడా భుజాన వేసుకొని మోశారు.అటు తర్వాత జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టి, మూడవ దఫా ఆ పదవిలో కొనసాగుతున్నారు.జిల్లా అధ్యక్షునిగా మూడు సార్లు నియమితులైన నాయకులు ఇప్పటి వరకు ఈ జిల్లాలో లేరు. తన గెలుపు ప్రధానం కాదని,పార్టీ ముఖ్యమని ఆయన అభిప్రాయ పడుతుంటారు. 2009 లో జిల్లాలో 8 స్థానాలు గెలుచుకున్న తెలుగుదేశం పార్టీ 2014 లో 10 స్థానాలు గెలుచుకోటానికి ఉమ శ్రమ కారణమంటున్నారు. పరిశీలకులు, జిల్లాలో కీలకమైన విజయవాడ మునిసిపల్ కార్పోరేషన్, విజయవాడ పార్లమెంటు స్థానంలో తెలుగుదేశం విజయం సాధించటానికి ఉమ నాయకత్వమే కారణమని విజేతలు సైతం అభిప్రాయపడుతున్నారు.

ఉద్యమాల సారధి,అలుపెరగని పోరాట యోధుడు దేవినేని ఉమా మహేశ్వరరావుకు రాష్ట్రమంత్రి స్థానం దక్కటంతో, మైలవరం నియోజకవర్గం ఓటర్లు మాత్రమే కాదు. జిల్లా నలుమూలల ఉన్న తెలుగుదేశం శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తూ, హర్షామోదాల కనబరిచారు. ఉమా మహేశ్వరరావు కన్నా సీనియరు శాసనసభ్యులు ఈ జిల్లాలో ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారికి ప్రాధాన్యత కల్పించాకనే ఉమాకు మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తారని తలనెరసిన రాజకీయ నాయకులు, పరిశీలకులు భావించారు. జిల్లాలో ఉమాకు ప్రాధాన్యతనిస్తారని ఏ ఒక్కరూ భావించలేదు. మంత్రివర్గ ప్రకటించే సమయంలో, కృష్ణాజిల్లా నుంచి మొట్టమొదటి ఉమా పేరును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలవటంతో అభిమానులు ఉబ్బితబ్బియ్యారు. హైదరాబాదులో శాసనసభ్యుల ప్రమాణ స్వీకారంతో కూడా కృష్ణాజిల్లా నుంచి ఉమా పేరు మొట్టమొదటగా పిలవటం యాదృచ్ఛికమైనా, అభిమాలను అలరించింది.

మైలవరం శాసనసభ్యులకు రాష్ట్రమంత్రి వర్గంలో స్థానం దక్కటమే కాక, రాష్ట్రంలో అత్యంత కీలకమైన శాఖ కూడా దక్కింది. నీటిపారుదలశాఖ, ఆయకట్టు అభివృద్ధి, జలవనరుల నిర్వహణ ఉమామహేశ్వరావుకు అప్పగించబడ్డాయి. అత్యంత ప్రాధాన్యత గల నీటి పారుదల శాఖను సమర్ధుడైన ఉమామహేశ్వరావుకు అప్పగించడం ముఖ్యమంత్రి ముందు చూపుకు, ఉమా కార్యదక్షతకు తార్కాణమని పరిశీలకులు సైతం ప్రశంసించారు.రాష్ట్రంలో వనరులుండి, వసతులుండి, అంతకు మంచి సాంకేతిక విజ్ఞానం అపారంగా కలిగిన రైతు పెద్దలుండి కూడా వ్యవసాయం ఒడిదుడుకుల నెదుర్కొంటుంది. ఇందుకు ప్రధానమైనది నీటిసమస్య గోదావరి, కృష్ణాలాంటి జీవనదులు ఈ రాష్ట్రంలోనే సముద్రంలో కలుస్తున్నాయి. ఏటా వందల, వేల టి.యం.సి.ల నీరు సముద్రం పాలవుతుంది. జీవజలాలు ఉప్పునీటిలో కలిసి, వ్యవసాయానికి ముప్పువాటిల్లుతున్నా గుడ్లప్పగించి చూడటం మినహా, సాగుకు వినియోగించు కోలేకపోతున్నారు. సముద్రంలో కలిసిపోతున్న సాగునీరుకు అడ్డుకట్టు వేయాలని ప్రయత్నాలు జరిగినా, ఫలితాలనివ్వలేదు. వేలకోట్లను గుత్తేదారులకు సమర్పించిన ప్రభుత్వాలు, అటు పులిచింతల, ఇటు పోలవరం నిర్మాణాలు పూర్తిచేయటంలో విఫలమయ్యాయి.వేలకోట్లను గుత్తేదారులు స్వంతం చేసుకొన్న చిన్నా - పెద్దా నీటి ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌లో చాలా ఉన్నాయి. అవన్నీ పూర్తిచేసి, నీటిని సక్రమంగా, సజావుగా సాగుతు మళ్లించగలిగితే రాయలసీమ రతనాల సీమగా కోస్తా ఆంధ్రా ధాన్యాగారంగా విలసిల్లుతుంది, విరాజిల్లుతుంది. అలాంటివి జరగాలంటే సమర్థులు నీటి పారుదల శాఖకు సారధ్యం వహించాలి. ఉమామహేశ్వరరావు పట్టుదల, కార్యదక్షత, చిత్తశుద్ధి, ముక్కుకు సూటితనం గ్రహించిన ముఖ్యమంత్రి అందుకు సంబంధించిన మూడు శాఖలను ఉమాకు అప్పగించితే సీమాంధ్ర వ్యవసాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసిస్తుందని అభిప్రాయపడి ఉంటారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని ఉమా వమ్ముచేయలేదు. మంత్రిగా ప్రామణస్వీకారం చేసిన వారం లోపలే పులిచింతల ప్రాజెక్టును సందర్శించి, అధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపి, ఆగష్టు 15 నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి, నీటి నిల్వకు అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఆదేశాల ప్రకారం అధికారుల స్పందించి, సత్వర చర్యలు ప్రారంభించి, మంత్రి ఆదేశానుసారం ఆగష్టు 15 నాటికి పులిచింతలనుంచి కొంత నీటిని విడుదల చేసి రైతాంగానికి మేలు చేశారు. 2004 నుంచి కుంటినడక నడిచిన పులిచింతల సాగుకు నీరదించే స్థితికి చేరటంలో ప్రధాన పాత్ర నీటిపారుదల శాఖా మంత్రివర్యులు ఉమామహేశ్వరరావు లక్ష్య సాధనకు నిదర్శనం. మంత్రిగా బాధ్యతలు చేపట్టకముందునుంచీ, సాగునీటి వనరుల విషయం ఉమకు మంచి అవగాహన ఉండేది. పశ్చిమకృష్ణాలో పలు లిఫ్టు ఇరిగేషన్ పథకాలు ప్రారంభం కావటం, వాటిని సమర్ధవంతంగా పనిచేయించటంలో పట్టుదల కనబరిచేవారు. రాజకీయంలో ప్రవేశించక ముందు నుంచి ఆయన సేవలు పశ్చిమ కృష్ణాకే పరిమితమయ్యాయి. ఇపుడు రాష్ట్రమంత్రిగా ఆయన కార్యక్రమాలు 13 జిల్లాలకు విస్తరించి, వ్యవసాయ అభివృద్ధికి ముందడుగు వేస్తున్నారు. 2014 ఎన్నికల్లో తాను గెలవడంతోపాటు మండల పరిషత్‌లను, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాలను 34 గెలిపించారు.కట్టకడకు జిల్లాపరిషత్ అధ్యక్షపదవికి ప్రతిపక్ష పార్టీపోటీ చేసే అవకాశం కూడా లేకుండా, తెలుగుదేశం పార్టీ అభ్యర్ధినిని జిల్లా పరిషత్‌పీఠంపై కూర్చుండబెట్టారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా సుదీర్ఘకాలం కొనసాగుతూ, కార్యకర్తలతో కలసి మెలసి తిరుగుతూ పార్టీ పటిష్టతకు అకుంఠిత కృషి సల్పారు ఉమామహేశ్వరావు.

**- దాసరి ఆళ్వారస్వామి**
**(నవ్యాంధ్ర మంత్రులు సభాపతులు)**

### మైలవరం నియోజకవర్గం ప్రాధాన్యత

ఈ నియోజక వర్గంనుండి గెలుపొందిన చనుమోలు వెంకట్రావు, జలగం వెంగళరావు మంత్రి వర్గంలో రహదారులు, భవనముల శాఖలను నిర్వహించారు. టంగుటూరి అంజయ్య మంత్రి వర్గంలోనూ భవనం వెంకట్రామిరెడ్డి మంత్ర వర్గంలోనూ వ్యవసాయశాఖను నిర్వహించారు. కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రి వర్గంలో కొనసాగిన కాంగ్రెస్ యోధుడు చనుమోలు వెంకట్రావు హ్యాట్రిక్ విజయాలు సాధించటమే కాక, అయిదుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు.అసెంబ్లీకి అయిదుసార్లు ఎన్నికైన శాసనసభ్యులు ఈ జిల్లాలో మరొకరున్నారు. నాల్గుసార్లు వరుస ముఖ్యమంత్రుల మంత్రి వర్గాలతో కొనసాగిన ఏకైక నాయకుడు చనుమోలు మాత్రమే. దీన్ని బట్టి మైలవరం నియోజకవర్గంలో చనుమోలుకు ఎంతపట్టువుంతో అంచనా వేసుకోవచ్చు. టి.డి.పి. ఆవిర్భానికి ముందే చనుమోలు హ్యాట్రిక్ సాధించారు. అటు తర్వాత కూడా రెండుసార్లు మైలవరం నుంచే గెలుపొందారు.

### టి.డి.పి.కి మైలవరం పట్టుగొమ్మ

తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత ఎనిమిది సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఆరు విజయాలు టి.డి.పి. ఖాతాలోనే టి.డి.పి. తరపున వడ్డే శోభనాద్రీశ్వరరావు గెలుపొంది, చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో పూర్తి కాలం వ్యవసాయ మంత్రిగా కొనసాగారు. ఇక్కడ విజయం సాధించిన ఉమామహేశ్వరరావు భారీ నాటి పారుదలశాఖ బాధ్యతలు చేపట్టారు. 1955 లో మాత్రమే మైలవరం నియోజకవర్గంగా రూపుదాల్చింది. అంతకు ముందు ఎక్కువ భాగం తిరువూరు నియోజకవర్గంలో కలిసి ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మైలవరం నియోజకవర్గంమైంది. కమ్యూనిస్టులకు మంచి బలమున్న నియోజకవర్గం మైలవరం. 1955,1962 ఎన్నికల్లో సి.పి.ఐ. అభ్యర్థి వెల్లంకి విశ్వేశ్వరరావు వరుస విజయాలు సాధించి, మూడవసారి ఓటమి పాలయ్యారు. ఈ నియోజకవర్గానికి జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో సి.పి.ఐ.అభ్యర్థి వెల్లంకి విశ్వేశ్వరరావు వరుస విజయాలు సాధించి, మూడవసారి ఓటమి పాలయ్యారు. ఈ నియోజక వర్గానికి జరిగిన మొట్టమొదటి ఎన్నిక అత్యంత ప్రతిష్ఠాకరం అని చెప్పాలి.ఆ ఎన్నికల్లో సి.పి.ఐ. అభ్యర్థి విశ్వేశ్వరరావుపై పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి పెదర్ల వెంకటసుబ్బయ్య కేవలం 84 ఓటర్లు తేడాతో పరాజయం చెందారు. 1999 లో విజయం సాధించి, మంత్రిగా కొనసాగిన వడ్డే శోభనాద్రీశ్వరరావు ఉయ్యూరు నుంచి వచ్చారు. 2009లో విజయం సాధించిన దేవినేని ఉమామహేశ్వరరావు నందిగామ నుంచి వచ్చారు. దీన్నిబట్టి స్థానికులను మాత్రమే కాకుండా, వలస వచ్చిన అభ్యర్థులను కూడా గెలిపించటం ఈ నియోజకవర్గం ఓటర్లకు వారసత్వమని పిస్తుంది. మైలవరం నుంచి ఎన్నికైన చనుమోలు, వడ్డేలు వ్యవసాయ మంత్రులుగా కొనసాగటం విశేషం.

## ప్రజల మనోభావాలు పరిరక్షించాలి

➢ మొదటి పేజీ తరువాయి

చేసి ఆలయాలను కూల్చివేసి పురాతన విగ్రహాలను మూటకట్టి విజయవాడ కార్పొరేషన్ బయట తాళ్ళతో బంధించివేసి ఎండకు, వానకు విసిరేసినట్లుగా చేసి ప్రజల మనోభావాలను గాయపర్చడం జరిగిం దని పలువురు పీఠాధిపతులు వాపోయారు. వారు భక్తుల మనోభావాలను బాహాటంగానే వ్యక్తం చేశారు. విజయవాడలో జరిగిన సభలో నర్సాపురం బిజెపి ఎంపి గోకరాజు గంగరాజు తదితర ప్రజాప్రతినిధులు, స్వామీజీలు, పీఠాధిపతులు ఏకకంఠంతో ప్రభుత్వ చర్యను నిరసించారు. చివరకు ఇది బిజెపి, తెలుగుదేశం పార్టీల మధ్య సమస్యగా మారిపోయింది. ఆవేశకావేశాలు, బలప్రదర్శనలు జరిగాయి. కానీ అసలు సమస్యను మరుగునపర్చారు. భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాక ప్రభుత్వం మేల్కొనడం, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి నష్టనివారణ చర్యలు చేపట్టడం, ఐదుగురు మంత్రులతో ఆలయాల కూల్చివేతపై ఉపసంఘాన్ని నియమించడం జరిగింది. ఇకనుండి ఆలయాలు కూల్చమంటూ ప్రకటించడం జరిగింది. కానీ జరగరాని నష్టం జరిగిపోయింది. భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ అవసరాలు ఎటువంటి చర్య చేపట్టినా ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ స్థానిక ప్రజలను సంప్రదించి, ఆలయ కమిటీల అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనడంలో సందేహంలేదు.

**ఏం కొనగలం? ఏం తినగలం?**

ఇకపోతే రాష్ట్రంలో ధరలు ప్రజలపై పెనుభారం మోపుతున్నాయి. కూరగాయల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఆర్‌టిసి ఛార్జీలు, ఇంటి పన్నులు తదితర అనేక రకాల పన్నుల భారాలను ప్రజలపై మోపి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారనే భావన సర్వత్రా నెలకొంది. సంక్షేమ పథకాలు అమలులో కూడా అనేక లోపాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

రంజాన్ తోఫా సరుకులు, పెన్షన్ల పంపిణీ వంటి కార్యక్రమాల్లో కూడా ప్రజలు నూటికి నూరు శాతం సంతృప్తికరంగా లేరు. పప్పుల ధరలు విపరీతంగా పెరిగాయి. బియ్యం ధరలు ఆకాశాన్ని అంటాయి. కందిపప్పు సామాన్యుడు కొనే పరిస్థితి లేకుండాపోయింది. ఈ పరిస్థితులను సమీక్షించి వాటిని ప్రజలకు తక్కువ ధరలకు అందించే యంత్రాంగం కరువైంది. రాజకీయ సమస్యలపైనే కాకుండా ప్రజాసమస్యలపై కూడా పాలకులు దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలులో సమస్యలను అధిగమించాలి. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి అధికారులను అందుకు చర్యలు తీసుకోవడానికి ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## పథకాలతో పరుగులు

➢ మొదటి పేజీ తరువాయి

సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించి అందువలన పార్టీకి ఎంత మైలేజీ వచ్చిందో ఆలోచించాలని ఆయన సూచించారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను ఎంతమేరకు అమలు చేశామో ప్రజలకు పారదర్శకంగా వివరించాలని ఆయన భావించారు. అదేవిధంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడానికి పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపి కింజరపు రామ్మోహన్‌నాయుడు, మేకా మల్లిఖార్జునరెడ్డి, కాల్వ శ్రీనివాసులు, కెఎస్ జవహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. సంక్షేమ పథకాలు వ్యయప్రయాసలుకోర్చి పేద ప్రజలకోసం వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నా అందుకు తగిన ప్రచారం కూడా సరిగా లేదనే అభిప్రాయాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు. ఇక ఎమ్మెల్యేల పనితీరుపై తాను సర్వే చేశానని, అందరి వివరాలు తన దగ్గర ఉన్నాయని పార్టీ అధినేత చెప్పడంతో పలువురు నాయకులు ఖంగుతిన్నట్లు తెల్సింది. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను తు.చ తప్పకుండా అమలు చేయాలని అందులో పాల్గొని ప్రజలకు పార్టీ గురించిన సందేశాన్ని అందజేయాలని, ప్రభుత్వ పనితీరు గురించి ప్రజలకు తెలపాలని చంద్రబాబు కోరారు. ఇప్పటికైనా పార్టీ నాయకులు నూటికి నూరుశాతం మార్కులు సాధించడానికి, ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను సక్రమంగా సద్వినియోగం కావడానికి దోహదపడాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ తాజాగా చేపట్టిన గడప గడపకు వైఎస్సార్‌సీపీ అనే కార్యక్రమంపై అంతర్గతంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ప్రభుత్వంపై చేసే ప్రతి విమర్శకు నాయకులు జవాబుచెప్పాలని, వాస్తవాలను ప్రజలకు వివరించాలని కూడా ముఖ్యమంత్రి నిర్దేశించినట్లు తెలిసింది.

### పశ్చిమ గోదావరి జిల్లాలో
## ఎల్ఈడీ లైట్లతో విద్యుత్ ఆదా
### జిల్లా ఇన్‌ఛార్జి పి.మధు

**రాజధాని ప్రతినిధి,కె.వి.రమణారావు, జంగారెడ్డిగూడెం :** జిల్లాలోని మున్సిపాలిటీల్లో వీధిలైట్లకు ఎల్ఈడీ బల్బుల వాడకం ద్వారా విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గుతాయని తద్వారా మున్సిపాలిటీల విద్యుత్ బిల్లుల వ్యయం తగ్గుతుందని కేంద్ర ప్రభుత్వం అనుబంధ సంస్థ ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) టెక్నికల్ ఇంజనీర్, మున్సిపాలిటీల్లో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు పథకం జిల్లా ఇన్‌ఛార్జి పి.మధు పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం నగర పంచాయతీలో ఏర్పాటుచేస్తున్న ఎల్ఈడీ బల్బుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఏలూరు కార్పోరేషన్‌లో 7,230 ఎల్ఈడీ బల్బులు, కొవ్వూరు మున్సిపాలిటీలో 1,718, నరసాపురంలో 2,326, నిడదవోలులో 1,873, పాలకొల్లులో 2,223 వీదిలైట్లకు ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు పనులు పూర్తయ్యాయన్నారు. తణుకు, తాడేపల్లిగూడెంలో ఆయా మున్సిపాలిటీలే సొంతంగా ఏర్పాటు చేసుకున్నాయన్నారు. భీమవరం మున్సిపాలిటీలో పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. అయితే ఆ మున్సిపాలిటీ సుమారు 2,500 ఎల్ఈడీ బల్బులు సొంతంగా ఏర్పాటు చేసుకోగా, మరో 1,500 తాము సమకూరుస్తున్నట్లు తెలిపారు. వీధిలైట్లకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటుచేశాక ఏడేళ్ళ పాటు నిర్వహణ బాధ్యత తమదేనన్నారు. జంగారెడ్డిగూడెంలో 95శాతం పనులు పూర్తయ్యాయన్నార. మొత్తం 2,406 వీధిలైట్లకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. మరో 600 లైట్లు అదనంగా కావాలని నగర పంచాయతీ ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ ప్రతీ నెలా రూ. 1.96 లక్షలు నిర్వహణ నిమిత్తం తమకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జంగారెడ్డిగూడెం నగర పంచాయతీలో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటుకు పూర్వం వీధిలైట్లకు ఏటా 6.87 లక్షల యూనిట్లు వినియోగించేవారని, ఎల్ఈడీ బల్బుల ఏర్పాటుతో ఇది 2,66,500 యూనిట్లు మాత్రమే ఖర్చవుతోందన్నారు. ఏటా 4,20,500 యూనిట్లు ఆదా అవుతోందన్నారు. కమిషనర్ చోడగం వెంకటేశ్వరరావు, విద్యుత్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ మంతుడు మొదటి రోజు
కలెక్షన్స్ 10 కోట్లు
బాహుబలి మొదటి రోజు
కలెక్షన్స్ 50 కోట్లు
నారాయణ జూనియర్ కాలేజ్
ఫీజులు మొదటి రోజు
కలెక్షన్స్ 200 కోట్లు

# కబేళాకు గోవులు

**పట్టించుకోని రవాణా, పోలీసు శాఖలు**

**రాజధాని ప్రతినిధి, ఏలూరు :** పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవల కొంత కాలంగా గోవులను అక్రమ రవాణా చేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. గోవులను ఇతర రాష్ట్రాలకు చెందిన కబేళాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ సంఘటనకు కొవ్వూరు, బుట్టాయిగూడెం మండలాల్లో పోలీసుల సోదాల్లో స్వాధీనం చేసుకున్న గోవులే సాక్ష్యంగా చెప్పవచ్చు. అత్యంత రహస్యంగా ప్రత్యేక కంటైనర్‌లలో గోవులను ఎక్కించి దొడ్డిదారిన తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గత వారం రోజుల క్రితం వరుసగా గోవులను కంటైనర్‌లలో బంధించి, బయటకు కనిపించకుండా చేసి వాటిని దెందులూరు నుండి భీమడోలు, ద్వారకాతిరుమల, చింతలపూడి మీదుగా తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు కొందరికి సమాచారం అందడంతో పోలీసులకు, రవాణాశాఖకు చెందిన చెక్‌పోస్టు అధికారులకు తెలియజేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. గత మే నెలలో ఇదే సంఘటన కొవ్వూరులో జరగగా కొందరిని పోలీసులు అరెస్టు చేసి గోవులను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించారు. ఇటీవల బుట్టాయిగూడెంలో అక్రమంగా రవాణా చేస్తున్న మూగజీవాలను గమనించి పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. అయితే ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ముఠాలను మాత్రం ఇంకా పోలీసులు గుర్తించలేదు. ఈ అక్రమ రవాణా వెనుక పెద్ద ఎత్తున పలుకుబడి కలిగిన వ్యక్తులే ఉండవచ్చునని సమాచారం మాత్రం అందుతోంది. అత్యంత రహస్యంగా మారుమూల ప్రాంతాల గుండా, గోవులు కనిపించకుండా కంటైనర్లలో ఎక్కించి వాటిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ విషయాన్ని ద్వారకాతిరుమల పోలీసులకు, చింతలపూడి రవాణాశాఖ చెక్‌పోస్టు సిబ్బందికి కూడా కొందరు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. కానీ ఫలితం లేదని వారు వాపోతున్నారు. అంతేకాకుండా గోసంరక్షణ సమితికి చెందిన నాయకులు కూడా వీటిపై ఇంకా దృష్టి సారించలేదు. రవాణాశాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా రాత్రివేళ, తెల్లవారుజాముల్లో నిఘా వేసినట్లయితే ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసినట్లు కాగలదు. అంతేకాకుండా ఈ రాకెట్ వెనుక ఎవరెవరు ఉన్నది కూడా సమాచారం బయటకు వచ్చే అవకాశం ఉంది. కనుక ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేకించి పోలీసు, రవాణాశాఖలో సమన్వయంతో గోవుల అక్రమ రవాణాను నిరోధించి, కబేళాలకు తరలకుండా మూగజీవాలను రక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మానవతా దృక్పథంతోనైనా ఈ చర్య తీసుకోవలసిన బాధ్యత ఉంది.



గోవులను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

ఒళ్లు గగుర్పొడిచే బైక్ విన్యాసాలు కేవలం పురుషులు మాత్రమే చేస్తారనుకుంటే పొరపాటే ఎందుకంటే ఆనం హషిమ్ .. అలవోకగా ఈ విన్యాసాలన్నింటినీ చేయగలదు... ఈమె మనదేశంలో తొలి మహిళా బైక్ స్టంట్ నిపుణురాలు. గత ఏడాది స్కూటీపై హిమాలయాలకూ వెళ్లి రికార్డు సృష్టించిన 20ఏళ్ల ఆనమ్.. ఈసారి తనలాంటి యువతుల్నీ తీసుకెళ్లబోతోంది.



# ఈమె స్టంట్స్ చూస్తే స్టన్ అవుతారు

## తొలి మహిళా బైక్ స్టంట్ నిపుణురాలు ఆనం హషిమ్

ఆమె

రెండేళ్లకిందట భారత క్రికెట్ కెప్టెన్ ధోనీ కూడా నా విన్యాసాలు చూసి 'ఇంత సన్నగా ఉన్నావ్. కానీ నువ్వు చేసిన ఆ విన్యాసాలేవీ ఇంతబరువున్న నేనూ చేయలేను!' అన్నాడు ఆశ్చర్యంగా...



ధోనీతో హషిమ్

రహదారులపై విన్యాసా లొద్దు.. బైకు స్టంట్ షోలంటే తప్పుడు అభిప్రాయం ఉంది. వాటినెప్పుడూ సరైన శిక్షణతో ప్రత్యేక ట్రాక్స్‌పై మాత్రమే ప్రదర్శించాలి. కానీ చాలామంది ఈ స్టంట్‌లు రహదారిపై చేస్తుంటారు. మరి నువ్వు నేర్చుకునేటప్పుడు ఎలా చేశావ్.. అంటారా? నేనూ ఎప్పుడు రహదారులపై విన్యాసాలు చేయలేదు. మొదట్నుంచి ప్రత్యేక ట్రాక్‌లపైనే! ఎందుకంటే బైక్ స్టంట్సే నా జీవితమని నాకు అప్పుడే నిర్ణయించుకున్నాను....

**అసలెలా ఈ రంగంలోకి వచ్చానని ఆలోచిస్తున్నారా ...**

ఒక రోజు స్నేహితులతో కలిసి టీవీ చూస్తూ ఉంటే.. అకస్మాత్తుగా ఒకతను.. వెనక వైపు చక్రంపై పైకిలేచాడు(దీన్ని 'హైఛెయిర్ వీలీ')అంటారని తర్వాత తెలిసింది!). ఆహా .. అనిపించింది. ఆ తర్వాత ముందువైపు చక్రంపై(ఇది 'స్టాపీ') మరోసారి బైక్‌పై నిటారుగా నిల్చున్నాడు('క్రైస్ట్'). అద్భుతమనిపించింది. ఇదేమిటీ అనడిగితే 'బైక్ స్టంట్స్' అన్నారు. అప్పటి నుంచి నాకు నిద్రపట్టలేదని చెప్పుకొచ్చారు ఆనమ్...ఇక స్టంట్స్ గురించి నెట్‌లో సమస్త సమాచారం సేకరించి, మొదట మా ఇంటి స్కూటర్‌లోనే క్రైస్ట్ చేశాను! నా ఫ్రెండ్ బైక్ అడిగి మిగతావీ మొదలుపెట్టాను. అన్నీ చేతికొచ్చేశాయ్. ఆ తర్వాత పుణెలోని ఓ బృందంతో కలిసి స్టంట్స్ చేయడం మొదలుపెట్టా. చిన్న చిన్నపోటీలకి వెళ్లడం ప్రారంభించాను. అప్పుడే అందరూ చెప్పారు.. 'దేశంలో తొలి బైక్ స్టంట్ అమ్మాయి నువ్వేనని..!'. అప్పుడు నాకు పదహారేళ్లు ...

ఐదేళ్లప్పుడే నాన్న నాకు బైకు నడపడం నేర్పించారు.. చాలా చిన్న మోటారు బైక్ అది. ఆ తర్వాత స్కూటరైనా, బైకైనా నాకు నా శరీరం నుంచి వేరుగా అనిపించలేదు. అలవోకగా నేర్చుకున్నాను. టీవీలో స్టంట్స్ చూసి, వాటినే నా ప్రపంచంగా మార్చుకున్నాను. కానీ.. నేను ఈ రంగం ఎంచుకుంటున్నానని తెలిసి ఇంట్లో ససేమిరా అన్నారు. ఎందుకంటే మాది సంప్రదాయ ముస్లిం కుటుంబం. బంధువులందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. కాని నేను పట్టించుకోలేదు...

సన్నగా ఉంటాను కదా! భారీ బైకులతో వెనకాల చక్రాల ఆధారంగా పైకి లేచినప్పుడు.. వాహనం బరువంతా నాపై పడేది. తట్టుకోలేక కింద పడేదాన్ని. అలా ఎన్ని ప్రమాదలయ్యాయో! కండలేని మనిషిని కదా.. కోలుకోవడానికి చాలా సమయమే పట్టింది. కానీ అటు కుటుంబంలో వ్యతిరేకతా, ఇటు గాయాలూ ఏవీ స్టంట్స్‌పై నాకున్న మక్కువని దూరం చేయలేకపోయాయి. ఆ తర్వాత స్నేహితులతో కలిసి భారత్‌లో నేనే కార్యక్రమాలు నిర్వహించడం మొదలుపెట్టా... స్టంట్ చేయాలంటే అమ్మాయిలకంటూ ప్రత్యేక 'గేర్' ఉండాలి. దానికి ఎక్కువ ఖర్చవుతుంది. అప్పుడే అమెరికాలోని ఐకాన్ మోటార్‌స్పోర్ట్స్ సంస్థ నాకు స్పాన్సర్‌షిప్‌కి ముందుకొచ్చింది. మరిచిపోలేని ఆనందం అది!

**మహిళా రైడర్లకు ప్రత్యేక దుస్తులు..**


రైడింగ్, స్టంట్‌కు సంబంధించి మన దగ్గర అమ్మాయిలకు ప్రత్యేక దుస్తులు దొరకడం లేదు. నేను పుణెలో ఫ్యాషన్ డిజైనింగ్ డిగ్రీ చేస్తున్నాను. అది పూర్తయ్యాక మహిళా రైడర్లకు నప్పే దుస్తులను డిజైన్ చేసే కంపెనీ స్థాపించాలనే యోచన ఉంది. సంగీతం, వంటచేయడం, స్కెచింగ్ నా అభిరుచులు. పోతే, దేశంలో స్టంట్‌రైడింగ్‌కి ప్రత్యేక ఛాంపియన్‌షిప్‌కానీ సమాఖ్యకానీ ఇప్పటిదాకా లేదు. దాన్ని నేను ప్రారంభించి.. ఇటీవలే ఇండియా బైక్ వీక్ ఛాంపియన్‌షిప్ నిర్వహించానని ఆనమ్ తెలిపారు. ఆల్ ది బెస్ట్ ఆనమ్...

**హిమాలయాలపై స్కూటీతో..**

ప్రపంచంలోనే మోటారు వాహనాలు వెళ్లగలిగే అతి ఎత్తైన రహదారి హిమాలయాల్లోని ఖర్దుంగ్‌లా. పైకి వెళ్లేకొద్దీ ప్రాణవాయువు స్థాయి తగ్గుతూ ఉంటుంది.. బలమైన గాలులు వీస్తుంటాయి. అలాంటి రహదారిలో నేను వెళ్లాలంటూ టీవీఎస్ సంస్థ నుంచి అవకాశం వచ్చింది. కానీ తమ జెస్ట్ 110 స్కూటీతోనే వెళ్లాలన్నారు! ఇంతవరకూ ఎవరూ చేయని సాహసమది. అసలు గేర్లే లేని వాహనంపై సముద్రమట్టానికి 17,582 అడుగుల ఎత్తున ఉన్న ప్రదేశానికి చేరుకోవడం ఎవరూ వూహించని విషయం! కానీ నేను దాన్నో సవాలుగా తీసుకున్నా. ముందుగానే యోగా, ఇతర శిక్షణలు తీసుకున్నా. జమ్మూ నుంచి శ్రీనగర్, లే, ఖర్దుంగ్‌లా వరకు ప్రయాణించి గమ్యం చేరుకున్నాను. అతిచిన్న వయసులోనే ఆ ఘనత సాధించిన అమ్మాయిగా నన్ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించింది. 'టీవీఎస్ హిమాలయన్ హైస్ సీజన్-2' పేరుతో ఈసారి పదిమందిని ఎంపిక చేశారు. వీళ్లందరికీ నేనే నాయకత్వం వహించబోతున్నా. నిజానికి ఉత్తరాదితో పోలిస్తే.. దక్షిణాది అమ్మాయిలే బైకు రైడింగ్‌పై ఎక్కువ ఉత్సాహం చూపిస్తున్నారు.

## వెలగపూడిలో వర్షాకాల సమావేశాలు

- ఆగస్టుకు తాత్కాలిక సచివాలయం పనులు పూర్తి: సీఎం
- వర్షాల కారణంగా పనులు ఆలస్యం అయ్యాయి
- ఇది లూజ్ సాయిల్.. ఇక్కడ బురద ఉంటుంది



**రాజధాని ప్రతినిధి - అమరావతి :** శాసనసభ వర్షాకాల సమావేశాలు వెలగపూడిలోని నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. తాత్కాలిక సచివాలయ నిర్మాణ పనులన్నీ ఆగస్టు నాటికి పూర్తి చేస్తామన్నారు. అప్పటి నుంచి పూర్తిస్థాయి పరిపాలన అమనావతి నుంచే కొనసాగుతుందని తెలిపారు. వెలగపూడి వద్ద నిర్మిస్తున్న తాత్కాలిక సచివాలయం నిర్మాణ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి.. అనంతరం ఉండవల్లిలోని తన నివాసం నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో వేగంపెంచాలని అధికారులను ఆదేశించారు. తొలుత తాత్కాలిక సచివాలయంలో గత నెల 29న ప్రారంభించిన ఐదవ భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని మంత్రులు, ఉన్నతాధికారుల చాంబర్లు, నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించి ఇంజనీర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. తాత్కాలిక సచివాలయ నిర్మాణ పనులు ప్రారంభించి సుమారు 135 రోజులైందన్నారు. వర్షాల కారణంగా పనులు ఆలస్యం అయ్యాయని, చిన్న చిన్న సమస్యలను ఉద్యోగులు మంచి మనసుతో సర్దుకుపోవాలని కోరారు. లూజ్ సాయిల్ కారణంగా ఈ ప్రాంతంలో కొంత బురద ఉంటుందన్నారు. ఐటీ కంపెనీల తరహాలో తాత్కాలిక సచివాలయాన్ని తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. ప్రజలు నడిచేందుకు రోడ్లు వేస్తున్నామని, వాటిపై మసీదులు, ఆలయాలు కట్టడానికి వీల్లేదని.. విగ్రహాలు పెట్టేందుకు కూడా ఒప్పుకోమని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. కెనాల్స్‌కు ఇరువైపుల నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారిని జక్కంపూడికి తరలించనున్నట్లు తెలిపారు. ఐదవ భవనం మొదటి అంతస్తును ఈ నెల 6న కాకుండా 11వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులు మందకొడిగా జరుగుతుండటంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టెలికాన్ఫరెన్స్‌లో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి వారం 13 వేల మరుగదొడ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. పోటీతత్వం పెరిగితే అన్ని గ్రామాలు స్మార్ట్‌గా రూపొందుతాయన్నారు. నైజీరియాలో కిడ్నాప్‌నకు గురైన తెలుగు ఇంజనీరింగ్ సాయి శ్రీనివాస్‌ను క్షేమంగా విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌కు సీఎం చంద్రబాబు లేఖ రాశారు. అంతకుముందు నైజీరియాలో భారత హైకమిషనర్ బి.ఎన్. రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. అంతకుముందు చంద్రబాబు తనక్యాంపు కార్యాలయంలో సీఆర్‌డీఏ సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ రాజధానిలో మౌలిక వసతుల కల్పన వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదశించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి జెట్టి గురునాథరావు పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు వంద మందికి పైగా శీలం కృష్ణంరాజు ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని గురునాథరావు సాదరంగా ఆహ్వానించి కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల ప్రసాద్, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర, చిన్ని రామసత్యనారాయణ, పెనుమాక దుర్గయ్య, మల్లిపూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి హెచ్చరిక

### పుష్కరాలకు సహాయ నిరాకరణ



**రాజధాని,ప్రతినిధి- విజయవాడ(వన్‌టౌన్) :** విజయవాడలో కూల్చివేసిన ఆలయాలను పునర్నిర్మించకుంటే కృష్ణా పుష్కరాలకు రాజధాని పరిసరాల్లో సహాయ నిరాకరణ చేపడతామని శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి హెచ్చరించారు. వన్‌టౌన్‌లోని కొత్తగుళ్ల ప్రాంగణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతీయ ధర్మానికి మూలమైన హైందవ సంప్రదాయాలను ఈ ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో అర్ధరాత్రి అక్రమంగా ఆలయాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది హిందూమతంపై జరుగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వం గూండాల తరహా పాలన చేస్తోందని దుయ్యబట్టారు. దీనికి కారణమైన ఎంపీ తక్షణం రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఆలయాలకు దాతలిచ్చిన భూముల్లో సత్రాలు నిర్మిస్తే ఆ ఆస్తులను ప్రభుత్వం అక్రమంగా విక్రయిస్తోందని ఆయన మండిపడ్డారు. నేడు నిరసన ప్రదర్శన ఆలయాల కూల్చివేతకు నిరసనగా ధర్మ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన సోమవారం విజయవాడలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్టు శివస్వామి ప్రకటించారు. 40 మంది పీఠాధిపతుల సారథ్యంలో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. మనోభావాల్ని దెబ్బతీస్తున్నారు : సత్యానందభారతీస్వామి గన్నవరం: రోడ్ల విస్తరణకోసం రాష్ట్రప్రభుత్వం ఆలయాల్ని ధ్వంసం చేయడం రాష్ట్రానికే అరిష్టమని శ్రీభువనేశ్వరీ పీఠాధిపతి సత్యానందభారతీస్వామి పేర్కొన్నారు. ఆది వారం ఆయన కృష్ణాజిల్లా గన్నవరంలో విలేకరులతో మాట్లాడారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా 30కిపైగా దేవాలయాల్ని కూల్చివేయడం దారుణమన్నారు.

## తమ్మిన పోతురాజు రోడ్డు విస్తరణను అడ్డుకుని తీరుతాం : అఖిలపక్షం

**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ, గాంధీనగర్) :** చిట్టినగర్- మిల్క్‌ప్రాజెక్టు టీపీ రోడ్డు విస్తరణను అడ్డుకుని తీరుతామని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు. విస్తరణపేరుతో ప్రభుత్వం సాగిస్తున్న విధ్వంసంపై దాసరి భవన్‌లో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, వైసీపీ, బీజేపీలతో కూడిన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల నేతలు మాట్లాడుతూ టీపీ రోడ్డును విస్తరించాల్సిన అవసరం లేకపోయినప్పటికీ అధికారులు స్థానికులను బెదిరిస్తున్నారన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, ఇష్టారాజ్యంగా విస్తరించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా, ప్రణాళికా బద్ధంగా విస్తరణ చేపట్టాలని కోరారు. టీపీ రోడ్డు అప్పటికే మూడు పర్యాయాలు విస్తరించారని, ఇకపై విస్తరించడానికి వీల్లేదన్నారు. పార్టీలకతీతంగా టీపీ రోడ్డు విస్తరణ అడ్డుకుని తీరుతామన్నారు. ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. దోనేపూడి శంకర (సీపీఐ), దోనేపూడి కాశీనాథ్ (సీపీఎం), మల్లాది విష్ణు (కాంగ్రెస్), చందన సురేష్ (వైఎస్సార్ సీపీ), బి శివకుమార్ పట్నాయక్ (బీజేపీ) పాల్గొన్నారు.

## పుష్కరఘాట్ పనులు వేగవంతం చేయాలి

### దేవాదాయ కమిషనర్ వై.వి.అనురాధ



**రాజధాని ,(పెనుమూడి) :** పుష్కరఘాట్ పనులను వేగవంతం చేయాలని ఎండోమెంట్ కమిషనర్ వై.వి. అనురాధ చెప్పారు. మండలంలోని పెనుమూడి పుష్కరఘాట్‌ను, నాగేశ్వర స్వామి, సీతారాముల దేవాలయాలను రాత్రి ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు పూరిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అసౌక ర్యానికి గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దేవాలయాలలో నిర్వహింస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతలోపిస్తే చర్యలు తప్పవన్నారు. దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించడంలో వెనకాడే ప్రసక్తి లేదన్నారు. దేవాలయాలలో నిత్యపూజలు, కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించే విధంగా అధికారులు, అర్చకులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. నాగేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించిన ఆమె ఆలయానికి మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. స్వామివారికి మకర తోరణం చేయించేందుకు నిధులను అందిస్తామని చెప్పారు. ఆమె వెంట దేవాదాయశాఖ డీసీ సురేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ పీజే శ్రీనివాసరావు, డీఈ సిరిగుప్త సతీష్,ఏఈ చక్రవర్తి, ఈవో దుర్గాప్రసాద్ లున్నారు.

## హుండీ లెక్కింపు



**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెం గోకుల తిరుమలపారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.5,98,706లు వచ్చిందని ఈవో పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఈ మొత్తం 100 రోజులదని చెప్పారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి అనూరాధ పర్యవేక్షణలో లెక్కింపు జరిగిందన్నారు. హుండీ లెక్కింపులో త్రివేణి కళాశాల విద్యార్థులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారని ఈవో తెలిపారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** పర్యావరణ సమతుల్యతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందని జంగారెడ్డిగూడెం అటవీ క్షేత్రాధికారి టి.నరశింహరావు కోరారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పాఠశాల నర్సరీలోని ఉసిరి, గోరింటాకు, పారిజాత తదితర జాతులకు చెందిన 1000 మొక్కలను పంపిణీ చేశారు. జంగారెడ్డిగూడెం రేంజి పరిధిలో 5.4 లక్షల మొక్కలను పెంచి ప్రజలకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఉప అటవీక్షేత్రాధికారి ఎం.కరుణాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అసమానతలు తొలగించడానికే ప్రజా సాధికార సర్వే

### టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

**రాజధానివార్తలు, విజయవాడ:** పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతలను తొలగించేందుకే ప్రజా సాధికార సర్వేను చేపట్టినట్లు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సర్వేను జయప్రదం చేయాల్సిన బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలని ఆయన పార్టీ శ్రేణులను కోరారు. ఉండవల్లిలోని తన నివాసం నుండి శుక్రవారం ఆయన టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత రెండేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశామన్నారు.నిత్యావసర వస్తువుల పంపిణీ, బీమా, ఉపకారవేతనాలు.. ఎందులోనూ బోగస్‌లకు అవకాశం లేకుండా ఆధార్ అనుసంధానంతో సక్రమంగా అందచేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో వనరులను సద్వినియోగం చేసుకోవడం, ప్రతి ఒక్కరినీ చైతన్యపరచడం, పేదరికాన్ని నిర్మూలించడమే ప్రజాసాధికార సర్వే ప్రధాన లక్ష్యంగా తెలిపారు.

# 'కళ' తప్పిన కృష్ణా తీరం



వెంకటపాలెం పంటపొలాల్లో శశిరేఖా పరిణయం చిత్రం షూటింగ్ దృశ్యం (ఫైల్)



ఉద్దండరాయుని పాలెంలో రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రదేశంలో పరిస్థితి ఇలా...

**రాజదాని ప్రతినిధి,( తుళ్ళూరు) :** మండలంలోని వెంకటపాలెం, మందడం, తాళ్లాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెం, లింగాయపాలెం, రాయపూడి, అబ్బురాజుపాలెం, బోరుపాలెం, హరిశ్చంద్రపురం లను కృష్ణా నదీ తీర ప్రాంతలుగ వ్యవహరిస్తారు. పచ్చని పంట పొలాలు ,కృష్ణానదీ గలగలలు,లంకల అందాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలతో చూపరులకు కనువిందు చేసే కృష్ణా తీరం కళావిహీనంగా మారిందన్న మాటలు వినబడుతున్నాయి. సింగపూర్ వాళ్లను సైతం అబ్బురపరచిన కృష్ణా తీర పరిసర ప్రాంతాలు కళతప్పాయి. పంటపొలల్లో పక్షులకే రాగాలునేర్పేలా కూలీల సందడి, పక్షుల కిలకిలారావాలు మూగబోయాయి. రాజధాని నేపథ్యంలో పచ్చని పంటపొలాలను తొలగిస్తుం డడంతో కృష్ణా తీరం అందాలు చెదిరి పోతున్నాయి. అరటి,పసుపు, కంద, చెరకు,నిమ్మ, జామ, దొండ, క్యారెట్,మామిడి లాంటి పంటలు పండే కృష్ణా తీరంలో ప్రస్తుతం ఇంగ్లీషు కంప, అడవిబెండ, వయ్యారిభామ తదితర పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి అడవులను తలపింపజేస్తున్నాయి. పచ్చని చీర పరిచినట్లుండే పంట పొలాల్లో, రోడ్డుకిరువైపులా పచ్చని తోరణాలు కటినట్లుండే అరటి చేల అందాలు కనుమరుగవతున్నాయని ప్రకృతి అరాధకులు వాపోతున్నారు. ప్రకృతి అందాలతో కృష్ణా తీరం సినీపరిశ్రమను సైతం ఆకట్టుకుంది. అక్కినేని నాగేశ్వరరావు, మంజుల హీరోహీరోయిన్లుగా నటించిన 'బంగారు బొమ్మలు' వెంకటపాలెం కృష్ణా తీరంలో, కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'శశిరేఖపరిణయం' చిత్రాల షూటింగ్ వెంకటపాలెం, ఉండవల్లిగుహలు, ప్రకాశం బ్యారేజీ దగ్గరున్న లోటస్‌హోటల్‌లో జరిగింది. రాజేంద్రప్రసాద్ హీరోగా నటించిన 'జూలకటక' రాయపూడి, తుళ్ళూరులో, అధిత్ హీరోగా నటించిన 'తుంగభద్ర' చిత్రం షటింగ్ కృష్ణాతీరంలోని లింగాయపాలెం పంటపొలలో జరిగింది. రాజధాని శంకుస్థాపన సమయంలో మందడంలోని గోల్డెన్‌రూల్ స్కూల్‌లో 'ఫేస్‌బుక్' చిత్రం లాంచింగ్ జరగడం విశేషం. ప్రభుత్వం సుందరమైనా రాజధాని నిర్మిస్తామని, కోటి మొక్కల పెంపకం ద్వారా పచ్చదనాన్ని నింపుతమని చేస్తున ప్రకటనలు ప్రకృతీ ఆరాధకులను సంతృప్తి పరచలేకపోతున్నాయి. కృష్ణాతీరం అందాలుతిరిగి ఎప్పటికి సంతరించుకుంటాయోనని సణుక్కుంటున్నారు.

## ఆలయాలను పునర్నిర్మిస్తాం : సీఎం

**రాజధాని ప్రతినిధి - విజయవాడ:** రహదారుల విస్తరణలో భాగంగా తొలగించిన దేవాలయాలను సకల సౌకర్యాలతో మరోచోట పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆయన పుష్కర పనుల ప్రగతిని సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. దుర్గాఘాట్, మెడల్ గెస్ట్‌హౌస్‌ను సందర్శించారు. రాజధాని విస్తరనలో భాగంగా విజయవాడలో కొన్ని దేవలయాలను అనివార్యంగా తొలగించాల్సి వచ్చిందన్నారు. వీటిని తిరిగి శాస్త్రోక్తంగా నిర్మించి భక్తులకు అందుబాటులోకి అధికారులను ఆదేశించామ్నారు. పుష్కరాల ప్రత్యక్ష పర్యవేక్షణకు మోడల్ గెస్ట్‌హౌస్‌ను కంట్రోల్ రూమ్‌గా వినియోగిస్తామన్నారు. అన్ని ఘాట్లు, ఇతర ప్రాంతాలను అనుసంధానం చేసే కెమెరాలు ఇక్కడే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కనకదుర్గ గుడిపై జరుగుతున్న పుష్కర పనులను సీఎం తనిఖీ చేశారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.


## క్లాసిఫైడ్స్

రాజధాని ప్రాంతంలో స్థలాలు, పొలాలు కొనదలచిన, అమ్మాలన్నా సంప్రదించగలరు.
దాదా : 9441754056, రాయపూడి
వి. రవిశంకర్ : 9989360960, విజయవాడ.
ఎస్‌కె నాగుల్ : 9912192112, తుళ్ళూరు
ఎన్. రామోహనరావు : 8801933160, మందడం.

దాదా మెడికల్ ఫాన్సీ స్టోర్స్
& జిరాక్స్ తీయబడును
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి, రాజధాని ప్రాంతం
కౌసర్ : 9989035143, రాయపూడి.

ఖాజా ఖాదర్ రైస్ & జనరల్ స్టోర్స్
సరసమైన ధరలకు అన్ని కంపెనీల బియ్యం
సబ్‌స్టేషన్ సెంటర్, రాయపూడి పోస్ట్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా .
షేక్ జానీ, సెల్ : 9948450791

వివాహ బంధం
అన్ని కులముల, మతముల వారికి పెళ్ళి సంభంధములు చూడబడును.
షేఖ్ జానీ : 9985394613
అయ్యప్పనగర్, విజయవాడ.

REALESTATE

అనంతవరం గ్రామంలో పూలింగ్‌లో లేనిది, దారి, నీటివసతికల 5 నుంచి 10 ఎకరముల పొలము కావలెను. సంప్రదించండి 9440662699

కంచికచర్ల,దొనబండ ఏరియాలలో 25 ఎకరముల పొలం కావలెను. ఫోన్ : 9676844442

రేమండ్ టైలర్స్
మెయిన్ బజారు, తుళ్ళూరు

చంద్రిక ట్రేడర్స్
సిమెంట్, ఐరన్, హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్స్, సానిటరి వేర్ హోల్‌సేల్ అండ్ రిటేల్
రాయపూడి, తుళ్ళూరు మం. గుంటూరు జిల్లా.
ఫోన్ : 9908073516

కె.జి.ఎన్ కార్ ట్రావెల్స్
24 గంటలు కార్లు సప్లయ్ చేయబడును
ఫోన్ : 97040748420

సన్నిధి వెంకట పున్నారావు ,ఎల్ఐసి ఏజెంట్
కేరాఫ్ వైభవ్ డ్రెస్సెస్
బ్యాంక్ రోడ్డు, తుళ్ళూరు
సెల్ నెం. 9848407935

స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ దుర్ముఖినామ సంవత్సరం

# నాడీ జ్యోతిష్యం

ఆకుల వేణునాథ్ సిద్ధాంతి
cell : 90324 50197

**12 రాశుల ఫలితాలు జూలై 10- 16**

**మేషరాశి :** అనేక మానసిక టెంక్షన్స్‌లో వివాహాది శుభకార్యములు జరుగును. గృహమందు స్త్రీల వల్ల లాభము అభివృద్ధికి కష్టపడతారు. వృత్తి ఉద్యోగ వ్యవహారాలలో అనుకూలత ప్రతి విషయ ఆటంకాలుతో నిదానంగా పనులు ముందుకు సాగుతాయి. జీవితంలో ఎంతకష్టపడిన లాటరీ యోగం వచ్చిన ధనము ఖర్చులు అవుతాయి. శని ఆరాధన మంచిది.

**వృషభరాశి:** జీవనపోరాటం వృత్తి ఉద్యోగాలు ప్రమోషన్స్‌లో గుర్తింపు లేకపోవుట స్నేహితులకు యోగం కుటుంబబాధ్యత కోసం ధనము ఖర్చు అగుట కావలసినంతవరకు ధనప్రాప్తి ఆత్త సంతృప్తి చెందును. అంతర్గిత: స్త్రీలు కూడా కష్టపడి బాధ్యతలు పంచుకొనుట సంతాన విషయంలో కొంత ఆందోళన వృత్తిరేక బావాలు కన్పించుట చెడ్డ స్నేహం.

**మిధునరాశి :** ధైర్య సాహసాలు ప్రకటించుట ప్రేమ, వివాహ సంబంధాలు శుభకార్యాలు నెరవేరుట సంతానం వల్ల అభివృద్ధి కలుగును. తండ్రి ఆరోగ్యంలో ఆస్తి విషయాలలో బందుమిత్ర సోదర, సోదరీమణుల వల్ల కొంత చికాకులు పొందుదురు భార్య సంతానం యోగం అదృష్టం వల్ల సమస్యలు తీరుట అదృష్టంలాటరీ యోగం. దైవభక్తిక్రియలు ప్రదర్శించవలను.

**కర్కాటక రాశి:** సర్వసుఖభాగములు స్త్రీలు వల్ల పొందుదురు లాభము మహారాణి యోగం చాయింపు నోటితో చలామణి అగుట మాటల ముందు బందుమిత్ర సోదర, సోదరీమణుల ఉచ్చరించుట అపుడపుడు అనాలోచితంగా ప్రవర్తిస్తారు. అంతర్గతంగా సంతానం గురించి అలోచనలు చేస్తారు. విద్యాభ్యాసంలోపం శని, రాహు, కేతు నవగ్రహదోషాలు.

**సింహరాశి:** ధైర్యసాహసం, వాక్, ధన పటిమ కోల్పోవుట అన్నీఉన్న అనుభవించలేని శారీరక మానసిక పరిస్థితి వృత్తి ఉద్యోగ, వ్యవహారాలు ఇందు నిదానంగా పనులు పూర్తి అగుట భార్య/భర్తలో ఒక్కరికి అవమాన భంగములు ఎంత కష్టపడ్డ గుర్తింపులేకపోవుట, ప్రమోషన్స్ అభివృద్ధి ఆటంకాలు కలుగును.

**కన్యరాశి:** జీవన పోరాటం అధికం అనేక అనుభవాలు ప్రతిక్షణం తెలుసుకోనుట కొంతవరకు స్త్రీలు తల్లి, తండ్రి పెద్దలు అందరి వల్ల లాభము పొందుతారు. ఆత్మశక్తితో ముందుకు జీవితం నడిపిస్తారు. కావసినంత వరకు ధనప్రాప్తి లభించును. సంతానం విషయం, విద్యా విషయం,అభవృద్ధిలో అవరోధాలు ఆటంకాలు ఉంటాయి.

**తులారాశి :** సర్వవిధాలుగా లాభం పొందుతారు. వృత్తి ఉద్యోగ వ్యవహారాలు యందు అభివృద్ధి అందరి అనుకూలతలు ప్రాప్తించుట కుటుంబవ్యవస్థ యందు అందరు గొప్పవారిగా ఉంటారు. అన్ని బాగుండి సంతాన విషయాలలో అవమాన భంగాలు నెగ్‌టివ్ ఆలోచనలు కన్పించును.

**వృశ్చికరాశి :** సన్యాసియోగంలో రాజయోగం దైవభక్తి క్రియలు వల్ల బెటర్ వివాహాది కార్యము వల్ల స్త్రీల వల్ల వృత్తి ఉద్యోగ వ్యవహరాలు వల్ల లాభము అనేక మానసిక టెంక్షన్‌లో జాగ్రత్తగా నడవడిక సర్వ విదాలుగా లాభము పొందుతారు. శని, రాహు, కేతువు, కాంతులు మొత్తం మీద అంతా శుభమేకలుగును.

**ధనస్సురాశి :** ప్రేమ వివాహాది శుభకార్యములు జరుగవచ్చు శారీరక మానసిక బలం. అందరి వల్ల అన్నివిధాలుగా లాభములు పొందుదురు స్త్రీ, వ్యతిరేకత కూడా లాభం చేకూరుతుంది. అంత బాగున్నా కాని సంతానం విషయంలో దోషం ఆలోచన చింత అభివృద్ధి అనేకవిధానాలుగా ఆలోచనలు చేస్తారు.

**మకరరాశి :** శారీరకం, మానసిక వికాసం,శత్రు నీడలో ఉన్నట్లు కన్పించుట నమ్మినవారే నమ్మకదోషం దినాదినాభివృద్ధి ఫలితాలు తినివేయుట తద్వారా బి.పి., టెంక్షన్స్, నరాల బలహీనం, హార్ట్ స్టోక్ అనేక రకాలుగా బలహీనం అగును. రాజకీయ నాయకులకు ఎక్కువ కన్పించును. అందరు శత్రువులుగా కన్పించును ఎవరిని నమ్మాలో, నమ్మకర్లేదో తెలుసుకోలేని పరిస్థితి సెంట్రల్ గవర్నమెంటు వత్తిడులు అనుభవించుట 66 నుండి 78 వయస్సు వరకు ఈ ఫలితాలు కన్పించవచ్చును. కొన్ని పరిస్థితుల్లో హావట్ ప్రపంచం 0% బ్యాలెన్స్ ఆర్థిక మాన్యం కన్పించవచ్చు. ప్రధాన అగ్రదేశాలు ఏలో కూడా కన్పించవచ్చు భవిష్యత్ పై అంధకారం కన్పించును. ఆందోళనలు వ్యక్తి పరుచుటకు అవకాశం..

**కుంభరాశి:** అవమానభంగములు మానసిక టెంక్షన్స్ వృత్తి వ్యవహారాల ముందు ప్రతివిషయములో అభివృద్ధిలో ప్రమోషన్స్‌లో చికాకులు అన్ని ఆటంకాలతో జీవితం సాగుట సన్యాసంలో రాజ/రాణి యోగం అనుభవించుట కావలసినంత వరకు ఆర్థిక లావాదేవీలు జరుగవచ్చును. తల్లి, తండ్రుల నుండి పెద్దల నుండి ఓదార్పు వచ్చును.

**మీనరాశి :** ఆప్త అవమానభంగములు ఆందోళన ఆతురతతో తరపాటు మాటలు మాట్లాడుట వివాహాది శుభకార్యాలు స్త్రీల వల్ల సుఖములు లభించును. సంతానం వల్ల శుభములు శుభకార్యములు బలహీనముగాఉండి ఋణ, రోగ, శత్రుత్వం ఆస్తి చికాకులు పొందుదుట మాట చెలామణి అజ్ఞానాలతో సమస్యలు పూర్తి చేసుకొంటారు. అంతా సంతోషము జీవితము, లాభములు పొందుతారు.

# ప్రేగులను క్లీనుగా ఉంచే ఆహారం

ఆరోగ్యం



డాక్టర్. మంతెన సత్యన్నారాయణ

ఏ ఆహారంలో పీచు పదార్థముంటుందో అది ప్రేగులను ప్రతి రోజూ క్లీన్ చేస్తుంది. విరేచనము సాఫీగా అయ్యేటట్లు చేస్తుంది. మీరు కమలా తొనని నమిలాక రసాన్ని మ్రింగి, ఆ తరువాత నోటిలోకి వచ్చిన పిప్పిని ఉమ్మి వేస్తారు. ఆ ఊసేదే పీచుపదార్థం. ఇప్పుడు ఆ రసంతో పాటు పిప్పిని కూడా మ్రింగితే, ఆ రసం రక్తంలోనికి వెళ్ళి లాభాన్ని కలిగించినట్లే ఆ పిప్పి మీ పొట్ట, చిన్న ప్రేగులు, పెద్ద ప్రేగుల మొత్తాన్ని, కంచాన్ని పీచు శుభ్రం చేసినట్లుగా లాక్కొని విరేచనం గుండా బయటకు వస్తుంది. ఈ పీచు పదార్థం లేకపోతే మీ ప్రేగులు క్లీన్ కావు, పైగా మీకు విరేచనం సరిగా బయటకు రాదు. ఈ పీచు పదార్థం అనేది ప్రకృతి సిద్ధమైన అన్ని ఆహార పదార్థాలలోను ఉంటుంది. ఉదా॥నకు అన్ని కూరగయల్లోను ఉంటుంది. లేత కూరగయలను తొక్కలు తీయకుండా వండుకుంటే మంచిది. ఒక్కభాగంలో ఎక్కువ పీచు ఉంటుంది. కూరగాయలకు గుండు కొట్టి మరీ వండుకుంటే రేపొద్దున గడ్డకట్టి మరీ గాని మలం రాదు. రకాల పండ్లలో పీచు ఉంటుంది. ఆకుకూరల్లో కూడా బాగా పీచుపదార్థాలుంటాయి. కొబ్బరిలో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి కూరలలో పొయ్యి మీద నుంచి దింపుకొనే ముందు కొబ్బరి కోరు చల్లుకుని తినడం మంచిది. పీచుని మ్రింగమన్నామని ములక్కాడలు చీకాక ఆ పీచుని, తేగల్ని సమిలాక ఆ పిప్పిని కూడా పరమానందయ్య శిష్యులలాగా మింగకండి. అలాంటి పీచు మనకి అక్కర్లేదు. ప్రేగులను పట్టుకునే ఆహారాలు : ఏ ఆహారంలో పీచు ఉండదో ఆ ఆహారం ప్రేగుల్లో సరిగా జరుగదు. ప్రేగులగోడలను ఆరోగ్యంగా ఉంచదు. చనిపోయిన సూక్ష్మజీవులను శుభ్రం చేయదు. ఇలాంటి ఆహారం ముఖ్యంగా తెల్లటి బియ్యం. ఇందులో పీచు సున్నా. మనం ఇలాంటి బియ్యాన్ని తిని ప్రేగుల ఆరోగ్యం పాడుచేసున్నాము. పీచు పదార్థం పూర్తిగా లేని ఇతర ఆహారాలు-మైదాపిండి, బొంబాయి రవ్వ, ఉప్పుడు రవ్వ, షాపులో కొన్న గోధుమపిండి, పంచదార స్వీట్స్, బ్రెడ్స్, కేక్స్, నూడిల్స్, కూల్‌డ్రింక్స్, ఐస్క్రీమ్స్, పాలు, గ్రుడ్లు అన్ని రకాల మాంసాహారం (చివరకు చేపలు కూడా), చాకెట్లు, బిస్కెట్లు మొ॥నవి. వీటిని ఎక్కువగా తినేవారికి ప్రేగులలో దోషాలు పేరుకుపోతాయి. మలబద్ధకం ఇక పోదు. పిల్లల్ని కూడా ఇలాంటి ఆహారాలకి దూరంగా ఉంచాలి.

**మలబద్ధకం పోవాలంటే ఆహారం**

ఎవరైతే ప్రేగులను క్లీన్ చేసుకోవడానికి ఎనిమా చేసుకుంటున్నారో వారు ఆ ఎనిమా చేసుకున్నన్ని రోజులపాటు ఉదయం టిఫిన్ క్రింద ఉడికిన టిఫిన్‌లు గాని, మొలకెత్తిన విత్తనాలు కాని తినకూడదు. వీరు ఉదయం టిఫన్ క్రింద పండ్లనే తినాలి. బొప్పాయి. సపోటా, దానిమ్మ, ఖర్జూరం (10-15 వరకు తినవచ్చు) మరి ఏ ఇతర పండ్లనయినా (అరటి పండ్లు తప్ప) తినవచ్చు. ఒకవేళ దీనికి తోడు సుగరువ్యాధి ఉన్నవారైతే జామ, దానిమ్మ, బత్తాయి, పుల్లటి రేగుపండ్లు మొ॥వి వాడుకొవచ్చు. 10,15 రోజులు ప్రేగులు క్లీన్ అయ్యాక ఈ పండ్లును తినడం మాని మొలకెత్తిన విత్తనాల వంటి వాటిని తినడం మొదలు పెట్టవచ్చు. మలబద్ధకం, గ్యాస్ ట్రబుల్, ఆకలి మందం మొ॥లగు ఇబ్బందులున్నవారు పైన చెప్పినట్లుగా అలవాట్లు మార్చుకుంటే మంచిది. మధ్యాహ్నం భోజనంలో ఆడించిన గోధుమ పిండితో పుల్కాలు (నూనెలేకుండా రొట్టెలు) 3,4 కాల్చుకుని, అందులోనికి ఏ కూరనైనా సరే ఎక్కువగా పెట్టుకుని (సుమారు అరకేజి లేదా అంత కంటే ఎక్కువ) తినండి. కూరలను చప్పగా వండుకుంటే ఎక్కువగా తినగలుగుతారు. రొట్టెలతో కూరను తిన్న అందులో పురుగు, లేదా కొంచెం మజ్జిగ వేసికొని తినవచ్చు. సాయంకాలం భోజనంలో గోధుమ రొట్టెలు వద్దనుకుంటే జొన్న లేదా రాగిపిండితో చేసిన రొట్టెలను కాల్చుకుని మరలా ఎక్కువ కూరతో తినడి. ఇక పెరుగన్నం మానివెయ్యటం మంచిది. మలబద్ధకం దార్లో పడ్డాక రొట్టెలు వద్దనుకున్నవారు ముడిబియ్యం అన్నాన్ని లేదా గోధుమ అన్నాన్ని గాన్నీ తినవచ్చు.





ఎమ్మెల్యే జలీల్‌ఖాన్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న నీటి పారుదల శాఖామంత్రి, దేవినేని ఉమామహేశ్వరరావు తదితర కార్యకర్తలు

# నవ్యాంధ్రప్రదేశ్‌కు హరిత జలహారం!

**రాజధాని వార్తలు, విజయవాడ:** రాజధాని అమరావతిలో ఆమ్‌స్టర్‌డ్యామ్ తరహా హరిత జలహారం ఏర్పాటుపై అధ్యయనం చేయాలని నెదర్లాండ్స్ ప్రతినిధులు రాజధాని ప్రాంత అభివృద్ధి సాధికార సంస్థ (సీఆర్‌డీఏ)ని కోరారు. నగరంలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం నెదర్లాండ్స్ దేశం నుండి వచ్చిన ప్రతినిధి బృందానికి రాజధానిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అమరావతి నగర పరిధిలో కాలువల సుందరీకరణ, నదీ ముఖ ప్రాంతాల అభివృద్ధి అవకాశాలపై చర్చించారు. ముఖ్యంగా వాటర్‌ఫ్రంట్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అపార అనుభవం ఉన్న నెదర్లాండ్స్ ప్రతినిధులు బ్లూగ్రీన్ అభివృద్ధి నమూనాను సవివరంగా తెలియచేశారు. సీఆర్‌డీఏ చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, మాస్టర్‌ప్లాన్‌లో ప్రస్తావించిన అంశాలను పరిశీలించిన ఆ బృందం పర్యావరణ పరిరక్షణపై సంస్థ తీసుకుంటున్న చర్యలను ప్రశంసించింది.

**నెదర్లాండ్ ప్రతినిధులతో సీఆర్‌డీఏ సమావేశం**

రాజధాని నగరంలో అంతర్భాగం కానున్న కాలువలు, చెరువులు, ప్రత్యేకించి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విషయంలో ప్రపంచంలోనే మెరుగైన అవకాశాలను ఎంచుకుని ఏవిధంగా అమలు చేయవచ్చో వివరించారు. నెదర్లాండ్స్‌కు చెందిన బయోబేస్డ్ సంస్థ సీఈవో ఐఆర్ జెర్ట్ జాన్ స్కోల్టే, వరల్డ్ వాటర్ నెట్ సంస్థ రీజనల్ డైరెక్టర్ నీస్ వాన్ డెర్‌లగ్ట్, నెదర్లాండ్స్ ఎంబసీ వాటర్ - ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ శాఖ సీనియర్ పాలసీ అడ్వయిజర్ మాయా ఆచార్య ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ డీ కాశీవిశ్వేశ్వరరావు, స్ట్రాటజీ డైరెక్టర్ జేఎస్ఆర్‌కే శాస్త్రి, ఇన్‌ఫ్రా డైరెక్టర్ డాక్టర్ గణేష్‌బాబు, ప్లానింగ్ డైరెక్టర్ ఆర్ రామకృష్ణారావుతోపాటు పలువురు అధికారులు కూడా హాజరయ్యారు.

# కొనసాగుతున్న సైడ్ కాల్వల నిర్మాణం

**రాజధాని,ప్రతినిధి- తుళ్ళూరు :** మండల కేంద్రమైన తుళ్లూరులో సైడ్ కాల్వల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.దళిత వాడలలో ఇప్పటికే కొన్ని వార్డులలో మురుగునీరు పాదరుదలకు సైడ్ కాల్వల నిర్మాణం పూర్తి చేశారు.ఇంకా మిగిలిన ప్రాంతాలలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.దళితులు స్మశాన వాటిక సమీపంలో ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి.దళిత వాడలలోని కొన్ని వార్డుల్లో మురుగు నీరును స్మశానం వద్ద ఉన్న ప్రధాన కాల్వలోకి మళ్లించేందుకు వీలుగా నిర్మాణం చేస్తున్నారు.రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సైడ్ కాల్వల నిర్మాణం జరుగుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, నిధులను నిర్మాణ పనులకు హెచ్చిస్తున్నారు.



# వైఎస్ రాజశేఖర్ రెడ్డిది కాంగ్రెస్ పార్టీ డీఎన్‌ఏ

- పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి
- ఆంధ్రరత్నభవన్‌లో ఘనంగా వైఎస్ జయంతి వేడుకలు



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏ అని, కాంగ్రెస్ నేతేనని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో దివంగత వైఎస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రఘువీరారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వైఎస్‌ను తాము సొంత వ్యక్తిగా భావిస్తున్నామని, కొందరు స్వార్థ రాజకీయాలతో ఆయన్ని కాంగ్రెస్ నుంచి వేరు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగి,అన్ని వర్గాల ప్రజల సంక్షేమాభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. వైఎస్ పాలనలో ప్రతి కుటుంబంలోనూ ముగ్గురికిపైగా సంక్షేమ పథకాల్ని పొందారన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు.ఇలాంటి మహనీయుని ఆశయ సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు జోగు రత్నకుమార్, పీసీసీ ప్రధాన కారదర్శులు నరహరిశెట్టి నరసింహారావు, మీసాల రాజేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు దేవినేని అవినాష్, పీసీసీ అధికార ప్రతినిధి నిమ్మల జ్యోతిక, విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాది విష్ణు, కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కడియాల బుచ్చిబాబు, పీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ పొదిలి చంటిబాబు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం విజయవాడ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు నోటు పుస్తకాల్ని పంపిణీ చేశారు. తొలుత విజయవాడ ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ దగ్గర వైఎస్ విగ్రహానికి పీసీసీ చీఫ్ డాక్టర్ రఘువీరారెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాది విష్ణు తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు.

# జంగారెడ్డిగూడెం మండలంలో ప్రజాసాధికార సర్వే



తాడువాయిలో ఎంపీపీ మాణిక్యాంబ నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు...

**రాజధాని ప్రతినిధి, వి.రమణారావు, జంగారెడ్డిగూడెం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాసాధికార సర్వే నందు ప్రజలందరూ తమ పూర్తి వివరాలను ఎన్యుమరేటర్లకు అందజేసి సహకరించాలని ఆర్డీవో ఎస్.లవన్న కోరారు. జంగారెడ్డిగూడెం నగర పంచయతీలో ప్రజాసాధికార సర్వే సందర్భంగా ప్రప్రథమంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, ఆర్డీవో ఎస్.లవన్నల వివరాలను కమిషనర్ చోడగం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సేకరించారు. చైర్‌పర్సన్ శివలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలందరికీ అందాలనే ఉద్దేశ్యంతో ఈ సర్వేను ప్రారంభించారని తెలిపారు. దీనివలన బలహీన వర్గాల వారికి పథకాలు అందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. కమిషనర్ చోడగం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డుల్లోని అన్ని కుటుంబాల వద్దకు ఎన్యుమరేటర్లు వస్తారని, వారికి పూర్తి వివరాలు అందించాలని కోరారు. అదేవిధంగా జంగారెడ్డిగూడెం మండలంలో ప్రజాసాధికార సర్వేను తహాశీల్దారు జీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముందుగా తాడువాయి పంచాయతీలోని చల్లవారిగూడెంలో ఎంపీపీ కొడవటి మాణిక్యాంబ ఇంటి వద్ద సర్వేచేసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహాశీల్దారు మాట్లాడుతూ ఈ సర్వే నిమిత్తం 44 టీమ్‌లను, 5గురు సూపర్‌వైజర్లను, ఒక మాస్టర్ ట్రెయినీని ఏర్పాటుచేశామని, ఎన్యుమరేటర్లుగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్యేలు, వెలుగు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. జూలై, ఆగష్టులలో రెండు విడతలుగా జరిగే ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కొడవటి సత్తిరాజు నుంచి కూడా వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీదేవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఒకటే సమస్య కాదు

**రాజధాని,ప్రతినిధి-అమరావతి**

హైకోర్టు విభజన విషయంలో తెలంగాణ ఒకటే సమస్య అని చెప్పడం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కేంద్రం ఈ విషయంలో కొంత చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.ఆదివారం వెలగపూడిలో చంద్రబాబు మాట్లాడుతూ.. విభజన సమస్యల పరిష్కారం కోసం కేంద్రం జోక్యం అవసరమని చంద్రబాబు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వారి సమస్యలను మాత్రమే చూపుతూ, నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న పెను సమస్యల గురించి మాట్లాడటం లేదని ఆరోపించారు.రెండు రాష్ట్రాలూ చర్చించి పరిష్కరించుకోవాల్సిన సమస్యలు కొన్ని ఉన్నాయని, కేంద్రం కల్పించుకోవాల్సిన సమస్యలూ ఉన్నాయని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాలూ పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు తానెప్పుడూ సిద్ధంగానే ఉంటానని తెలియజేశారు.

**ఆగస్టు నాటికి పూర్తి స్థాయి తరలింపు**

హైదరాబాద్‌లోనూ ఉద్యోగులు ఆగస్టు చివరి నాటికి సచివాలయ ఉద్యోగులను పూర్తి స్థాయిలో వెలగపూడి కార్యాలయానికి తరలించడం జరుగుతుందని చంద్రబాబు అన్నారు. అప్పటి వరకు వెలగపూడిలో సచివాలయ నిర్మాణం పూర్తయిపోతుందని చెప్పారు.

## విభజనపై చంద్రబాబు

అంతేగాక, తెలుగు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నుంచి ఉద్యోగులందరినీ పూర్తిగా అమరావతికి షిఫ్ట్ చేయబోవడం లేదని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. కొంతమందిని అక్కడే ఉంచుతామని తెలిపారు. ఎవరెవరిని అక్కడే ఉంచాలన్న విషయమై మార్గదర్శకాలు రూపొందిస్తామని పేర్కొన్నారు. వ్యక్తిగత ఇబ్బందులు ఉన్నవారు, వయసు పెరిగి పదవీ విరమణకు దగ్గరైన వారు, మానవీయ కోణంలో పరిశీలించి ఎంపిక చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. మొత్తం ఉద్యోగుల్లో 5 నుంచి 10 శాతం మాత్రమే హైదరాబాద్‌లో కొనసాగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మిగతావారంతా అమరావతికి వచ్చేస్తారని చంద్రబాబు తెలియజేశారు.

# 'అసైన్డ్' వారసులకు కౌలు చెక్కులు ఏవి?

**రాజధాని,ప్రతినిధి- తుళ్ళూరు :** రాజధాని ప్రాంతంలో అసైన్డ్ భూములను వారసత్వంగా సాగు చేసుకుంటున్నవారికి ప్రభుత్వం రెండో ఏడాది కౌలు చెక్కులు నేటికి పంపిణీ చేయక పోవడం విమర్శలకు తావిస్తోంది. గత ఏడాది అసైన్డ్ భూములను వారసత్వంగా సాగు చేసుకుంటున్నవారిని గుర్తించిన ప్రభుత్వం కొంత ఆలస్యంగానైనా సాగుదారులకు కౌలు చెక్కులు అందజేసింది.ఈ ఏడాది మాత్రం ఇప్పటివరకు కౌలు చెక్కులు ఇవ్వకపోవడం సాగుదారులను ఆందోళనకు గురిచేస్తోంది. రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాలలో సుమారు 2100 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నట్లు సమాచారం వీటిలో సగానికి పైగా క్రయ విక్రయాలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.వాస్తవానికి అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోలు చేయకూడదు.1977 అసైన్డ్ ల్యాండ్ యాక్ట్ ప్రకారం క్రయ విక్రయాలు చెల్లుబాటు కావు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం క్రయ విక్రయాలు జరిగిన అసైన్డ్ భూములకు ఇప్పటి వరకు కౌలు చెక్కులు పంపిణీ చేయలేదు. అయితే వారసత్వంగా సాగు చేసుకుంటున్న వారికి సైతం ఈ ఏడాది కౌలు చెక్కులు పంపిణీ చేయకపోవడంఅయోమయానికి గురిచేస్తోందని అసైన్డ్ భూములను వారసత్వంగా సాగు చేసుకుంటున్న వారు వాపోతున్నారు.అసైన్డ్ ల్యాండ్ యాక్టు ప్రకారం అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్నవారికి కౌలు చెల్లింపు వల్ల ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది ఉండదని , అయినప్పటికి ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందో అంతుపట్టడం లేదని వారు అంటున్నారు.పట్టా భూములున్న రైతులకు ఇప్పటికే రెండో ఏడాది కౌలు చెక్కులు అందజేసిన ప్రభుత్వం అసైన్డ్ వారసులపై ఎందుకు ఇంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందో బోధపడడం లేదని తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు.ఓ వైపు వ్యవసాయ పనులు లేక కౌలు చెక్కులు సైతం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి అసైన్డ్ వారసులకు కౌలు చెక్కులు అందించాలని వారు కోరుతున్నారు.



తుళ్ళూరు - దొండపాడు మధ్య ఉన్న అసైన్డ్ భూములు

# బ్రెగ్జిట్ పర్యవసానాలు

## -ఈయూ దేశాలపై ప్రభావం



'బ్రెగ్జిట్' పదం ప్రపంచ రాజకీయ చరిత్రలో సంచలనం సృష్టించింది. ప్రపంచదేశాల్లో తీవ్ర ఉత్కంఠను రేపింది. యూరప్ ఖండంలోని పలు దేశాల్లో చరిత్ర తిరగరాసింది. ఆర్థిక వ్యవస్థను కదిలించి సంచలనం సృష్టించింది. బ్రిటన్‌పౌరుల అభిప్రాయానికోసం యావత్తు ప్రపంచం ఎదురుచూసింది. యూరోపియన్ యూనియన్ బ్రిటన్ ఎగ్జిట్ సంక్షిప్తంగా 'బ్రెగ్జిట్' పదం వ్యవహారంలోకి వచ్చింది. జూన్ 23న ప్రవేశపెట్టిన రెఫరెండంలో నిష్క్రమణకు అనుకూలంగా 51.9శాతం, వ్యతిరేకంగా 48.1శాతం ఓట్లు నమోదయ్యాయి. 1951లో యూరోపియన్ కోల్ అండ్ స్టీల్ కమ్యూనిటీ, అ తరువాత యూరోపియన్ ఎకనమిక్ కమ్యూనిటీ ఏర్పడ్డాయి. మాస్ట్రిచ్ సంధి ద్వారా 1992లో ఈ రెండు కలిసి సంయుక్తంగా యూరోపియన్ యూనియన్(ఈయూ) గా ఏర్పడ్డాయి. ఆరు వ్యవస్థాపక దేశాలతో ఏర్పడిన ఈ కూటమి 28యూరప్‌లోని దేశాలకు సభ్యత్వమిచ్చింది. ఈయూ కూటమిలో సభ్యత్వం పొందాలంటే కొపెన్ హాగెన్ క్రైటీరియంలోని నిబంధనలు పాటించాలి. సభ్యత్వం పొందాలంటేకూడా ఆ దేశ పౌరుల ఆమోదాన్ని పార్లమెంటులోగానీ రెఫరెండం ద్వారాకానీ పొందవచ్చు. 1961లో ఇంగ్లాండ్,స్కాట్‌లాండ్,వేల్స్,ఉత్తర ఐర్లాండ్‌తో యునైటెడ్ కింగ్‌డమ్ ఈయూలో సభ్యత్వంకోసం దరఖాస్తు చేసుకుంది. వీటోతో వీగిపోవడంతో 1967లో రెండోసారి పెట్టుకున్న దరఖాస్తును ఫ్రాన్స్ వీటోతో నిలిపివేసింది. 1975లో ఈయూలో చేరడానికి అనుకూలంగా ఓటువుసింది. బ్రిటన్ ఈయూలో చేరినప్పటికీ యూరోను ఉమ్మడికరెన్సీగా స్వీకరించలేదు. పౌండ్‌నే కరెన్సీగా కొనసాగించింది.

బ్రిటన్ ఈయూలో సభ్యత్వం పొందాక ఒక వస్తువుపై పన్ను నిర్దేశక హక్కు కూడా ఆ దేశానికి లేకపోవడం, ఈయూ నిర్ణయించిన ధరలకే వాణిజ్యాన్ని సాగించాలనే నిబంధనలు చివరకు బ్రిటన్ తన స్వతంత్రతను కోల్పో తున్నామనే సదేహం తలెత్తింది. బ్రిటన్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వలస దారులను తమ దేశంలోకి స్వేచ్ఛగా అనుమతించడంతో నిరుద్యోగిత శాతం పెరుగుతోందనేది ముఖ్య సమస్య. టెర్రరిజం మరొకటి. ఈయూ లో చేరినప్పటినుండీ ఆ దేశం నెలకు 19బిలియన్ డాలర్లు చొప్పున చెల్లిసోతంది. ఇది బ్రిటన్ ఆర్థికవ్యవస్థపై ప్రభావం చూపింది. బ్రెగ్జిట్ ఒకేసారి ఉత్పన్నమైన సమస్యకాదు. ఈయూ కూటమిలో చేరనప్పటినుండీ ఒక వర్గానికి ఈ భావం ఏర్పడింది. 2015లో జరిగిన ఎన్నికల్లో బ్రిటన్ ప్రధానిగాఎన్నికైన కామెరున్ ఈయూలో కొనసాగడంపై రెఫరెండం నిర్వహిస్తానని ప్రకటించారు. అనంతరం ప్రధాని చేపట్టిన అనంతరం ఈ అంశంపై రెఫరెండం నిర్వహించారు. ప్రధాని కూడా బ్రెగ్జిట్‌ను వ్యతిరేకించారు. ఫ్రాన్స్, జర్మనీ, వంటి ఈయూ సభ్యత్వ దేశాలు సైతం బ్రెగ్జిట్‌ను నిరసించాయి. ఎఫ్‌డిఐలు తరలిపోయే ప్రమాదంఉంది. స్కాట్‌లాండ్ వంటి దేశాలు బ్రిటన్ నుంచి విడిపోవచ్చు అనే అంశాల ప్రాతిపదికంగా వీరు బ్రెగ్జిట్‌ను తిరస్కరించారు. బ్రిటన్ రెఫరెండంలో 71.8శాతం ప్రజలు పాల్గొన్నారు. అధికశాతంమంది బ్రిటన్ ఈయూ నుండి వైదొలగేందుకు అంగీకరించారు. దీనితో బ్రిటన్‌కు ఈయుతో గల 43ఏళ్ల అనుబంధం తెగిపోయింది. ఈయూ నుంచి సభ్యత్వ దేశం నిష్క్రమణ విధానం: ఈయూ నుంచి సభ్యత్వ దేశ నిష్క్రమించే విధానాన్ని 'లిస్బన్' ఒప్పందం(2009)లో పొందిపరచారు. ప్రకరణ 50 ప్రకారం సభ్యత్వ దేశం తమ రాజ్యాంగ అవసరాల మేరకు నిర్దిష్ట పరిస్థితుల మధ్య నిష్క్రమించేందుకు నిర్ణయం తీసుకోవచ్చు. దీనిపై ప్రజాభిప్రాయాన్ని ఆ దేశ రెఫరండం లేదా పార్లమెంటు ద్వారా తెలుసుకోవాలి. నిష్క్రమణకు మొగ్గుచూపితే ఆ ప్రతిపాదనను యూరోపియన్ కౌన్సిల్‌కు నోటీసు ద్వారా సమాచారం అందివ్వాలి. ఈ ప్రక్రియ పూర్తవడానికి రెండేళ్లు పడుతుంది. ఈ వ్యవధిలో ఆ దేశం తన నిర్ణయాన్ని వెనక్కితీసుకునే వీలుంది. రెండు సంవత్సరాల అనంతరం పార్లమెంట్, కౌన్సిల్ ఆమోదంతో సంబంధిత దేశం సభ్యత్వాన్ని కోల్పోతుంది.

**ఈయూతో పాటు మిగిలిన దేశాలపై ప్రభావం**

-'సెగ్జిట్' అనే పేరుతో స్వీడన్ కూడా వేరుకావాలనే దిశలో పయనిస్తోంది. ఈయూ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అధికంగా ఆకర్షిస్తున్న బ్రిటన్ ఈయూ నుండి వైదొలడం ద్వారా వాలి వాటా భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉంది

-అనే ఈయూ కేంద్రస్థానాలు లండన్‌లో ఉన్నాయి. వాటిపై బ్రెగ్జిట్ ప్రభావం ఉండవచ్చు. వాటిని మరొక దేశానికి తరలించడం ఆర్థిక సమస్యలకు దారితీస్తుంది.

-ప్రపంచదేశాల ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. విదేశీ వ్యవస్థాగత మదుపుదారులు తమ పెట్టుబడులను స్టాక్‌మార్కెట్‌నుంచి ఉపసంహరించుకోవడం ద్వారా విదేశీ మారక ద్రవ్యనిల్వలపై వత్తిడి పెరగవచ్చు.

-సెన్సెక్ భారీగా పతనం కావడంతో లక్షకోట్లకుపైగా పెట్టుబడిదారులకు నష్టం వాటిల్లింది.

-క్రూడ్ ఆయిల్ ధరలు పతనమయ్యాయి. బంగారం ధరకు రెక్కలొచ్చాయి.

బ్రిటన్‌పై ప్రభావం

-షెన్‌జెన్ అనే ఒప్పందం ద్వారా బ్రిటన్ పౌరులు ఈయూ దేశాల్లో పాస్‌పోర్టు, వీసాలేకుండా ప్రయాణించవచ్చు. ఇప్పుడు ఈ పరిస్థితి మారనుంది.

-పౌండ్ విలు 31సంవత్సరాలే కనిష్టానికి దిగజారింది. స్వేచ్ఛా వాణిజ్యాన్ని కొనసాగించిన బ్రిటన్ ఎగుమతులు, దిగుమతులు ఖర్చు అధికం అయ్యే అవకాశంఉంది. వలసదారులపై బ్రిటన్ ఏ నిర్ణయం తీసుకుంటందనేది వేచి చూడవలసిందే. ఈయూ ఏర్పడటానికి ముందు బ్రిటన్ వాణిజ్య పరిస్థితి ఎలాఉన్నాయో ఆ పరిస్థితికి దిగజారాయి.

-స్కాట్‌లాండ్ బ్రిటన్‌నుంచి విడిపోవచ్చని కొందరి అభిప్రాయం. బ్రెగ్జిట్ ప్రభావం యుకె ఉనికికే ప్రశ్నార్థకమవుతుంది. గ్రీస్‌లా బ్రిటన్ పుంజుకుంటుందా ఆర్థికమాంద్యంలో పడుతుందా అనేది ప్రశార్థకం.

# ప్రారంభమైన సమగ్రసర్వే..!

**కావేటి హరీష్, రాజధాని ప్రతినిధి, విజయవాడ :** నూతనంగా ఏర్పడిన నవ్యాంధ్రప్రదేశ్ పౌరుల సమగ్ర సమాచారాన్ని సేకరించే పనిలో పడింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. ఈ సర్వేలో భాగంగా ఈ నెల 8వ తేదీ నుండి ఈ "స్మార్ట్ పల్స్ సర్వే"ను ఏపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ సర్వేకు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుంది. ఈ సర్వే మొదట సీఎం చంద్రబాబు వివరాలతో మొదలు కానుంది. స్మార్ట్ పల్స్ సర్వే ముఖ్య ఉద్దేశ్యం పౌరుల ఆర్థిక స్థితి గతులు తెలుసుకోవడం. స్మార్ట్ పల్స్ సర్వేని పూర్తిగా ఆన్‌లైన్‌లో చేపడ తారు. సర్వే నిర్వహణకు ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేసే స్మార్ట్ పల్స్ సర్వే – 2016 అనే అప్లికేషన్‌ను తయారు చేశారు.

**ఎన్యుమరేటర్ వద్ద సమాచారం:** సర్వేలో భాగంగా పౌరుల ఆధార్ నెంబర్ సర్వర్‌లో ఎంటర్ చేయగానే ఆ వ్యక్తికి సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న సమా చారం ప్రత్యక్షమవుతుంది. ఈ సమాచారాన్ని ఎన్యుమరేటర్ ఇంటి యజమానికి చదివి వినిపించి సమాచారంలో ఏమైనా తప్పులు ఉంటే వాటిని సవరించేందుకు ప్రత్యేక వెసలుబాటు కల్పించారు. స్మార్ట్ పల్స్ సర్వే సందర్భంగా ఎన్యుమరేటర్లు అడిగే ప్రశ్నలకు పౌరులు విధిగా సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అలాగే ఈ సర్వే నేపథ్యంలో మొత్తం 83 అంశాలపై ఎన్యుమరేటర్లు సమాచారం సేకరిస్తారు. సర్వేలో వ్యక్తి పేరు, ఆధార్, సెల్ నెంబర్, బ్యాంకు ఖాతా నెంబరు ముందుగా సేకరిస్తారు. అలాగే కులం, మతం, పుట్టినతేదీ, సంతానం మొదలగు వివరాలు నమోదు చేస్తారు. ఆ తరువాత విద్యార్హతలు, ప్రభుత్వం నుండి పొందిన ప్రయోజనాలు, ఉద్యోగం, ఉపాధి వంటి అంశాలను నమోదు చేస్తారు. అలాగే ఏదైనా ప్రభుత్వ సంక్షేమ పథాల వంటి వివరాలు అనగా రేషన్, పింఛను, ఋణాలు వంటి సమగ్ర సమాచారాన్ని నమోదు చేస్తారు.

**నోడల్ అధికారులుగా ఐఏఎస్‌లు :**

స్మార్ట్ పల్స్ సర్వేను సమగ్రంగా పక్కాగా నిర్వహించేందుకు పలువురు సీనియర్ ఐఏఎస్‌లను జిల్లాలకు నోడల్ అధికారులుగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సుమిత్రిదావ్రా (కృష్ణాజిల్లా), జయలక్ష్మి (గుంటూరు జిల్లా), శశిభూషణ్ కుమార్ (పశ్చిమగోదావరిజిల్లా), నీరజ్‌కుమార్ ప్రసాద్ (తూర్పు గోదావరి జిల్లా) లను నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు.

# విద్యార్థులకు శ్రవంతి ట్రస్టు ఆర్థిక సహాయం



విద్యార్థులకు సహాయం అందిస్తున్న సత్యప్రసాద్

**రాజధానిప్రతినిధి, దేవసహాయం- హనుమాన్‌జంక్షన్ :** శ్రవంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జె.డ్.పి.హెచ్ హైస్కూల్ బాపులపాడు నందు ప్రధానోపాధ్యాయురాలు లలిత కామేశ్వరి అధ్యక్షతన పాఠశాల విద్యార్థుల కోసం కార్యక్రమము నిర్వహించబడింది.ఈకార్యక్రమంలో భాగంగా 350 విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ యేయడం జరిగింది.10వ తరగతిలో 15,16 సం:విద్యాసంవత్సరంలో బాపులపాడు మండలంలో 9.8 మార్కులతో ప్రధమ స్థానం సాధించి కేంద్రప్రభుత్వ ప్రతిబా పురష్కార అవార్డును దక్కించుకొని,111ఐ లో సీటు సంపాదించిన జి నాగరమ్య ని అభినందించడం జరిగింది.అదే విధంగా మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను అభినందించి వీరికి పై చదువులకు ఆర్థిక సహయం అందించడం జరిగింది.అదే విధంగా ఇప్పటి 10 వతరగతి విద్యార్థులకు 65మందికి చదువులో గెలవడం అనే మంచి పుస్తకాన్ని అందించడం జరిగింది.ఈకార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్,తుమ్మల చిట్టియ్య,డి.వి రమణ.పాలడుగు శ్రీధర్,నీలం లక్ష్మి అనసూయ,ఆనకాల మాల్యాద్రి,గొట్టపు వాసుదేవారావు,మేడేపూడి రామ్మోహనరావు,ముత్యాల సువర్ణరాజు,షేక్ ముంతాజ్,తాడి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తపై బెదిరింపు కేసులో నకిలీ నక్సలైట్ల అరెస్టు

- అంబికా ప్రసాద్‌తో సహా పలువురు నుండి భారీగా సొమ్ము వసూలు
- సిపిఐ(ఎంఎల్) ప్రజా ప్రతిఘటన పేరుతో దందాలు
- ఆటకట్టించిన ఏలూరు టూటౌన్ పోలీసులు



**రాజధానిప్రతినిధి- ఏలూరు :** వీరిద్దరూ ఆవారా గాళ్ళు. ఒకే జిల్లాకు చెందిన వారేమో వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం బాగా పెరిగింది. వీరిద్దరూ జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించాలనే కోరిక వారి మదిలో మెదిలింది. ఇదే అదనుగా వీరిద్దరూ కలిసి నకిలీ నక్సలైట్ల అవతారమెత్తి తాము సిపిఐఎంఎల్ ప్రజాప్రతిఘటన పార్టీ చంద్ర పుల్లారెడ్డి గ్రూప్ సభ్యులుగా చలామణి అవుతూ ఆ పేరు మీద కరపత్రాలను పంచుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో వీరు హవా కొనసాగించి పలువురు వ్యాపారస్తులు, రియల్టర్ల నుంచి 30 లక్షలు వసూలు చేశారు. అందులో ఏలూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి అంబికా ప్రసాద్ వద్ద నుండి 18 లక్షలు వసూలు చేశారు. ఆపై రూ 50 లక్షలు కావాలని మళ్లీ డిమాండ్ చేయడంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు. ఇంకేముంది నకిలీల గుట్టు రట్టయింది. గురువారం మధ్యాహ్నం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుల కార్యాలయ సమావేశ మందిరంలో విలేఖరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌పి భాస్కర్ భూషణ్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం బోడ్లాడ గ్రామానికి చెందిన రాపాక శ్రీరాములు అలియాస్ ప్రసాద్ (44), వరంగల్ జిల్లా రాయపర్తి మండలం రాయపర్తి గ్రామానికి చెందిన పెనుగొంటి వెంకటేశ్వరరావు (41) వీరిద్దరూ ఒకే జిల్లాకు చెందిన వారు. వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. వీరు ఏ పని పాట లేకుండా ఆవారాగా తిరుగుతుండేవారు. ఈ క్రమంలో 2000వ సంవత్సరంలో వీరి మదిలో ఒక ఆలోచన మెదిలింది. మెదిలిందే తడవుగా ఆలోచనను ఆచరణలోకి తెచ్చారు. నక్సలైట్ల అవతారమెత్తి వారంతట వారే తాము సిపిఐ(ఎంఎల్) ప్రజా ప్రతిఘటన పార్టీ చంద్ర పుల్లారెడ్డి గ్రూప్‌కు చెందిన వారమంటూ పరిచయాలు చేసుకోవడం మొదలు పెట్టారు. తదుపరి ఓ అడుగు ముందుకేసి అప్పట్లో ఉచితంగా వచ్చే సిమ్‌లను తీసుకొని జిల్లాల్లోనూ, రాష్ట్రాల్లోనూ అతి పెద్ద స్థాయిలో ఉండి పెద్ద, పెద్ద వ్యాపారం చేసే వ్యాపారస్తులను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను, సమాజంలోనూ, సంఘంలోనూ పెద్ద మనుషులుగా ఉండేవారిపై వీరు గురిపెట్టారు. తదుపరి వీరు ఒక జాబితా తయారు చేశారు. వారి ఫోన్ నెంబర్లు సేకరించి వారికి ఫోన్లు చేసి తాము నక్సలైట్ల మంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. డబ్బు కావాలని డిమాండ్ చేస్తారు. లేకపోతే చంపుతామని బెదిరిస్తారు. సిపిఐ(ఎంఎల్) ప్రజా ప్రతిఘటన పార్టీ చంద్రపుల్లారెడ్డి గ్రూప్‌కు చెందిన లెటర్‌హెడ్ నమూనాలను తయారు చేసి వాటిపై బెదిరింపు లేఖలు రాసి వారికి పంపుతారు. దీంతో సదరు వ్యాపారులు భయపడి వీరికి అడిగినం డబ్బు అప్పజెప్పడం షరా మామూలైపోయింది. వీరిద్దరు ఒక్క తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో పలువురిని వీరి జాబితాలో చేర్చి వారిపై కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీరిపై ఇప్పటికే 13 కేసులు ఉన్నాయి. గత కొద్ది కాలంగా ఏలూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి ఆలపాటి వజ్ర అంబికా ప్రసాద్‌ను బెదిరించడం ప్రారంభించారు. దీంతో భయపడిన ఆయన వారికి దఫ దఫాలుగా దాదాపుగా 18 లక్షల రూపాయలను ఇచ్చారు. తదుపరి వారు అదనంగా 50 లక్షలు కావాలంటూ డిమాండ్ చేశారు. దీంతో విసుగు చెందిన ఆయన ఈనెల 2వ తేదీన టుటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చి వారిపై కేసు నమోదు చేయించారు.

దీంతో రంగంలోకి దిగిన టూటౌన్ పోలీసులు వారి కదలికలపై నిఘా వుంచి వారిని చాకచక్యంగా గురువారం ఉదయం 6 గంటల సమయంలో టూటౌన్ ఎస్ఐ దుర్గారావు చొదిమెళ్ళ ప్రాంతంలో తిరుగుతున్న వీరిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి ఏపీ29బిఆర్ 0189 అనే నెంబరు గల హుందాయ్ ఐ20 కారును, బ్లాంకా ఎయిర్‌పిస్టల్‌ను, సిపిఐ(ఎంఎల్) ప్రజా ప్రతిఘటన పార్టీ చంద్రపుల్లారెడ్డి గ్రూప్‌కు చెందిన లెటర్‌హెడ్‌లను, మూడు సెల్‌ఫోన్లను, 5 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి జి వెంకటేశ్వరరావు, ఎస్‌బి డిఎస్‌పి భాస్కరరావు, డిసిఆర్‌బి డిఎస్‌పి పైడేశ్వరరావు, టూటౌన్ ఎస్ఐ దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.6 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు



ప్రారంభిస్తున్న సర్పంచ్,ఉపసర్పంచ్

**రాజధానిప్రతినిధి,దేవసహాయం- హనుమాన్‌జంక్షన్ :** బాపులపాడు గ్రామంలోని ఎస్.సి కాలనీలో 134 మీటర్లు ఆరు లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు శుక్రువారం ఉదయం సర్పంచ్ కాకాని అరుణ,ఉపసర్పంచ్ కాకాని బాబు నిర్మాణపు పనులను ప్రారంభించారు.ఈకార్యక్రమంలో బాపులపాడు తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ కొల్లి వెంట్రరావు,దయాల రాజేశ్వరరావు,దుట్టా శ్రీమన్నారాయణ,సరిపల్లి అద్భుతరావు, దయాల విజయనాయుడు,వార్డు మెంబర్ జాలాది విజయకుమార్,జాలాది సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ సమతుల్యానికి మొక్కలు దోహదం : మంత్రి పీతల సుజాత



చింతలపూడిలో మొక్కలు నాటుతున్న రాష్ట్ర మంత్రి పీతల సుజాత

**రాజధాని ప్రతినిధి - చింతలపూడి :** పశ్చిమ గోదావరి జిల్లాలో వాతావరణ సమతుల్యానికి ఈ ఏడాది కోటి మొక్కలను నాటుతున్నట్లు రాష్ట్ర గనులు స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి శ్రీమతి పీతల సుజాత చెప్పారు. వనసంరక్షణ కార్యక్రమంలో భాగంగా చింతలపూడిలో పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి శ్రీమతి పీతల సుజాత ప్రారంభించారు. జిల్లాలో 3 వేల 300 పాఠశాలల్లో నర్సరీలు ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు కోటిమొక్కలను సిద్ధం చేస్తామని అందులో ఇంతవరకూ 15 లక్షల మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో లక్ష మొక్కలు నాటుతున్నామన్నారు. ప్రతి నాలుగు వందల మొక్కలు నూరుశాతం సంరక్షించేందుకు ఏటా19 వేల రూపాయలను సంబంధిత కార్మికులకు చెల్లిస్తామన్నారు. జిల్లాలో నీటిసంరక్షణా కార్యక్రమాల్లో భాగంగా పది కోట్ల రూపాయలతో 12600 పనులు ఇంతవరకూ పూర్తి చేస్తామని చెప్పారు. మొక్కలు నాటే సంస్కృతిని ప్రతీ ఒక్కరూ అలవాటుచేసుకోవాలని తద్వారా ప్రకృతితో అనుబంధం పెంచుకోవడం ద్వారా ఆనందాన్ని పొందవచ్చునన్నారు. పశ్చిమగోదావరి జిల్లా అంతటా పచ్చని మొక్కలతో వర్ధిల్లాలని ఇందుకోసం వేప, ఉసిరి, దానిమ్మ, నేరేడు, సీతాఫలం వంటి మొక్కలను ఉచితంగా అందిస్తున్నామన్నారు.రాష్ట్రంలో ఉద్యమరూపంలో మొక్కలు నాటేందుకు ముఖ్యమంత్రి శ్రీనారా చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. వారి ఆలోచనకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ తమ ప్రాంతాల్లో, ఇళ్ల వద్ద ప్రభుత్వం ఉచితంగా అందించే మొక్కలను వేసి పరిసరాలను పచ్చదనం చేయాలని ఆమెపిలుపునిచ్చారు. రాష్ట్రం అభివృద్ధితోపాటు ప్రకృతి, పర్యావరణాన్ని కూడా పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తెరగాలన్నారు. మొక్కల ద్వారా లభించే చల్లదనాన్ని పొందడం ద్వారా మానసిక ఒత్తిడిని తొలగించుకోవచ్చునని చెప్పారు. ( ఆకాంక్షించారు. సమాజంలో అన్నివర్గాలవారికీ ప్రాధాన్యతనిస్తూ ముస్లిమ్‌లకు రంజాన్ సందర్భంగా చంద్రన్న రంజాన్ తోఫా కానుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11 లక్షల మంది ముస్లిమ్ కుటుంబాలకు అందించగా జిల్లాలో 27 వేలమందికి అందించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు ముస్లిమ్‌ల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వారి నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి వేగవంతంగా ముందుకు వెళ్లేందుకు అల్లా ఆశీస్సులు కోరుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి తాళ్లూరి రాధారాణి, యంపిపి దాసరి రామక్క, డ్వామా పిడి యంవి. రమణ, సామాజిక అటవీ విభాగం డియఫ్‌ఓ వైయస్. నాయుడు, తహశీల్దారు కె. మౌఖేల్‌రాజ్, యంపిడిఓ రాజశేఖర్, చెన్నంశెట్టి సీతారామయ్య (చినబాబు), జె. ముత్తారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం :**


చింతలపూడి నియోజవకర్గంలో 600 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులను చేసామని రాష్ట్ర గనులు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి పీతల సుజాత చెప్పారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మొక్కలు నాటి అనంతరం అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చింతలపూడి నియోజక వర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో లక్షమొక్కలు నాటాలని సంకల్పించామని ఇందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవతీసుకుని ప్రతీ ఇంటా, రహదారికి ఇరువైపులా, పాఠశాలల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటేలా కృషి చేయాలన్నారు. ఈసమావేశంలో జడ్‌పిటిసి తాళ్లూరి రాధారాణి, యంపిపి దాసరి రామక్క, డియస్‌పి జె. వెంకటరావు, తహశీల్దారు కె. మైఖేల్‌రాజు, యంపిడిఓ రాజశేఖర్‌లతో పాటు పలువురు యంపిటిసిలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# దుర్గగుడి ఈవోగా సూర్యకుమారి బాధ్యతల స్వీకరణ



**రాజధాని ప్రతినిధి,(విజయవాడ) :** దుర్గమల్లేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఐఏఎస్ అధికారిణి ఏ సూర్యకుమారి బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 11 గంటలకు దేవస్థానానికి వచ్చిన ఈవో తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రస్తుత ఈవో ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఆమె మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాత ఇంద్రకీలాద్రి గెస్ట్‌హౌస్ లోని తన కార్యాలయానికి వెళ్లారు. తొలుత దేవస్థానం ప్రధాన అర్చకులు ఎల్ దుర్గాప్రసాద్, వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. మధ్యాహ్నం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తాను నగరవాసినేనని, గతంలో సాధారణ భక్తురాలిగా దేవాలయానికి వచ్చానని గుర్తు చేసుకున్నారు. పుష్కరాలకు సాధారణంగా వచ్చే భక్తులకు ఐదు రెట్లు ఎక్కువగా ఉంటారని, దానికి తగినట్లు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కృష్ణమ్మ హారతుల్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. మైసూరులో దసరా ఉత్సవాల్లో తరహాలో దర్బారు, ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఆదాయం పెంచుతామని చెప్పారు.

# పశువైద్యశాలలో ఉచిత యాంటీరాబిస్ వ్యాక్సిన్



**రాజధానిప్రతినిధి, దేవసహాయం- హనుమాన్‌జంక్షన్ :** ప్రపంచ జూనోటిక్ వ్యాధుల దినోత్సవం సంధర్భంగా కె రమేష్‌బాబు ఆధ్వర్యంలో బాపులపాడు పశువైద్యశాల నందు 50 కుక్కలకు ఉచితంగా యాంటీరాబిస్ వాక్సిన్ వేస్తారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూనోటిక్ వ్యాదులు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వివరించారు. జంతువుల నుండి మనుషులకు, జంతువుల నుండి జంతువులకు సంక్రమించు వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అని పిలుస్తారు.జంతువులతో మానవుని సహచర్యం ఎంతో ప్రాచీనమైననది.ప్రతి మనిషి పశు పక్ష్యాదుల నుండి ఉత్పత్తి అయ్యే పాలు, గ్రుడ్లు, మాంసంపై ఆధారపడియున్నారు. మనుషులు పశువుల సహచర్యంతో జూనోటిక్ వ్యాధులు సంక్రమిస్తున్నాయి.ఈవ్యాధులు సుమారు 280 వరకు గుర్తించబడినాయి.లూయిస్ పాశ్చర్ అను శాస్త్రవేత్త మొదటి సారిగా 1885,జూలై 6వ తేదినాడు పిచ్చికుక్క కాటుకు గురైన బాలునికి వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకా మందు విజయవంతముగా ఇచ్చినందున ఆ రోజున ప్రపంచ జూనోటిక్ దినోత్సవముగా జరుపుకోబడుతుంది. పిచ్చికుక్క కాటు ద్వారా మనుషులకు సంక్రమించే ప్రాణాంతకరమైన వ్యాధి. కుక్క చొంగ ద్వారా కూడా వ్యాధి వ్యాప్తి చెందుతుంది.పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలను ప్రతి సంవత్సరం వేయించుకోవాలి అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమములో సిబ్బంది టి సుందర్‌రావు,విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



**రాజధానిప్రతినిధి, దేవసహాయం - హనుమాన్‌జంక్షన్ :** హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో డి.ఎస్పి శ్రీనివాసరావు, సి.ఐ జయకుమార్,ఎస్సై తులసీధర్ కలసి మొక్కలు నాటడం జరిగింది. పర్యావరణ పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని డి.ఎస్పి అన్నారు.

# విద్యార్థులకు మేథస్సును అందించాలి

**రాజధానిప్రతినిధి, దేవసహాయం- హనుమాన్‌జంక్షన్ :** బాపులపాడు మండలం బిళ్ళనపల్లి గ్రామంలో శ్రవంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతల పిల్లలకోసం కార్యక్రమం నిర్వహించబడింది గ్రామ సర్పంచ్ మాదల కృష్ణ కుమారి, ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ ఎదురవాడ ప్రసాద్ చేతుల మీదుగా పిల్లలకు నోట్ పుస్తకాలు పలకలు అందించడం జరిగింది,స్కూల్ ఆవరణంలో, వీరమాచనేని సత్యప్రసాద్ మొక్కలునాటడం జరిగింది ఈకార్యక్రమంలో వీరమాచనేని బుజ్జి,పోతుమరి సత్యన్నారాయణ,పాలడుగు శ్రీధర్,దోనవల్లి వెంకట్రమయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆలమూరు వైద్యాధికారికి సన్మానం

**రాజధానిప్రతినిధి,ఆలమూరు:** ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా॥ వి.రమేష్ ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం యమ్.డి. ఖమ్మం జిల్లా మమత మెడికల్ కాలేజ్‌కు వెళుచున్న సందర్భంగా, శుక్రవారం తనికులతాలుకా యన్‌క్యూఓ అసోసియేషన్, క్లస్టర్ పిహెచ్‌సిల పరిధిలోన వైద్య సిబ్బంది.వీడ్కోలు, సన్మాన సభ ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి శ్రీనివాస్ కె. శాంతమూర్తి, ఆర్.వి.యన్. మూర్తి, కె. జయమణి, పెనుమంట్ర, ఆలమూరు, మార్టేరు పిహెచ్ సి సిబ్బంది, ఆసుపత్రి అభివృద్ధి కమిటి మెంబర్. యమ్.నాగమణి, యస్.రమేష్‌బాబు,వెంకట్రాజు, యమ్. విజయకుమార్ రాజు, జి.సురేష్‌బాబు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధి చవ్వాకుల భరత్‌కుమార్, ఆరోగ్య మిత్ర, కె. చంటి పలువురు అభిమానులు, పేషెంట్సు పాల్గొన్నారు.



# రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం

**రాజధాని ప్రతినిధి- గుంటూరు:** గత రెండేళ్ల కాలంలో రూ.60 కోట్లతో జిల్లాలో 1,492 అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ షేక్ జానీమూని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఆమె పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వార్షిక వేడుకలను జెడ్పీ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జానీమూని మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతోనే జిల్లాలో అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పర్యావరణకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలని కోరారు. వైస్ చైర్మన్ వడ్లమూడి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ నిధులు తగ్గిపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వనరులను సమకూర్చుకునేందుకు రూ. 50 లక్షల నుంచి రూ. 1.50 కోట్ల వరకు నిధులు కేటాయించారని, ప్రతిపక్ష వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీలకు రూ.5 లక్షలకు మించి నిధులు మంజూరు చేయలేదని నిజాంపట్నం జెడ్పీటీసీ ప్రసారం వాసుదేవ అసంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్పీటీసీలు అందరూ ఒక కుంటుంబమని చెబుతున్న పాలకవర్గం ప్రతిపక్ష పార్టీవారిపై సవతి తల్లి ప్రేమను చూపడం బాధాకరమన్నారు.మండల పరిషత్ కారాలయ్యాల్లో జెడ్పీటీసీలనకు రెండేళ్లుగా కోరుతున్నా ఆచరణకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జెడ్పీటీసీలు కోటా శ్రీనివాసరావు (పొన్నూరు), బెజవాడ నరేంద్ర (తుళ్లూరు) కలగజేసుకుని ఈ విషయంలో అవసరమైతే సీఎంను కలుద్దామని ప్రతిపాదించారు. తొలుత చైర్‌పర్సన్ జానీమూని కేక్‌ను కట్‌చేశారు. అధికారులు, జెడ్పీటీసీలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో సోమినేని వెంకటసుబ్బయ్య, డిప్యూటీ సీఈవో జి. జోసఫ్‌కుమార్, అక్కౌంట్స్ అధికారి సీహెచ్. రవింద్రారెడ్డి, స్థాయీ సంఘాల చైర్మన్లు, ఉప్పుటూరి సీతామహాలక్ష్మి, చిలకా గ్లోరీవిల్సన్, వివిధ మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, జెడ్పీకార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## బాపులపాడు గ్రామ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



**దేవసహాయం, రాజధానిప్రతినిధి, హనుమాన్‌జంక్షన్:** బాపులపాడు గ్రామంలోని సిమెంట్ రోడ్డుల నిర్మాణ నిమిత్తం దాతలు రూ. లక్ష విరాళం అందించారు. ఆర్. కృష్ణమూర్తి రూ 30వేలు,దాసరి సత్యనారాయణ రూ30వేలు, మోటూరి కమలమ్మ రూ30వేలు,దొంటంశెట్టి శ్రీనివాసరావు రూ10వేలు సర్పంచ్ కాకాని అరుణ ఉపసర్పంచ్ కాకాని బాబుకు అందించారు.

# స్వాతంత్ర్య సమరయోధురాలు 'దుర్గాభాయి'

**( జూలై 15, జయంతి సందర్భంగా)**



స్వాతంత్ర్య సమరయోధురాలగా ఒక ప్రత్యేక సామాజిక కార్యకర్తగా స్త్రీల అభ్యున్నతికి అనితరంగా కృషిచేసిన దుర్గాభాయి దేశ్ ముఖ్, మధ్య తరగతి కుటుంబంలో రాజమండ్రిలో కృష్ణవేణమ్మ, రామారావు దంపతులకు జులై 15, 1909 న జన్మించింది. న్యాయవాది, రాజకీయ నాయకురాలు కూడా. ఆమె భారతదేశం యొక్క రాజ్యాంగ సభ, భారతదేశం యొక్క ప్రణాళికా సంఘం సభ్యురాలిగా కూడా పనిచేశారు. ఈమె బాల్యం నుండీ ప్రతిభాపాఠవాలను కనబరుస్తూ పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసులవారికీ విద్యాబోధన అందించారు. బెనారస్ విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్యులేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్. ఎల్.బి పూర్తిచేసింది.దుర్గాభాయి చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకుంది. తెలుగుగడ్డపై మహాత్మా గాంధీ రాకను పురస్కరించుకుని 12 ఏళ్ళ వయసులోనే ఈమె విరాళాలను సేకరించి ఆయనకు అందజేసింది.

మహాత్ముని సూచన మేరకు మారు ఆలోచించకుండా తన చేతులకు ఉన్న బంగారు గాజులను కూడా విరాళంగా అందించారు. 1923లో కాకినాడలోని కాంగ్రెస్ సభలకు వాలంటీరుగా పని చేస్తూ నెహ్రూ వద్ద టిక్కెట్ లేని కారణము చేత ఆయనను అనుమతించక, తన కర్తవ్య నిర్వహణకు గాను ఆయన నుండి ప్రశంసలను పొందింది. ఆ పై మహాత్ముని ఆంధ్ర పర్యటనలలో ఆయన హిందీ ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించింది. ఉప్పు సత్యాగ్రహములో పాలొనడంతో . స్వాతంత్ర్య సమర కాలంలో ఉద్యమాల్లో పాల్గొని విరామ సమయాల్లో విద్యాభ్యాసం చేసి ఎంఎ, బిఎల్, బిఎ ఆనర్స్ చేసి న్యాయకోవిదురాలిగా, ప్రఖ్యాత క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు. దుర్గాభాయి దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో 1937లో చెన్నైలో ఆంధ్ర మహిళా సభ స్థాపించబడింది. ఈమె 1941లో ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి, సంపాదకత్వ బాధ్యతలను నెరవేర్చారు. 1958లో హైదరాబాదులో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మహిళా వసతిగృహ ఏర్పాటుకై పాటుపడటమే గాక రాష్ట్రమంతటా ఎన్నో కళాశాలలు, వసతి గృహాలు, నర్సింగ్ హోమ్‌లు మరియు వృత్తి విద్యాకేంద్రాలు నెలకొల్పారు. దుర్గాబాయి అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషిచేశారు. చెన్నైలో 70మంది కార్యకర్తలతో ఉదయవనం పేరుతో సత్యాగ్రహ శిబిరం ఏర్పరిచారు. 1953లో ఆర్థికమంత్రి చింతామణి దేశ్ ముఖ్‌తో వివాహం జరిగింది. 1971లో సాక్షరతా భవన్‌ని ప్రారంభించినది. రెండు ఆసు పత్రులు, మూడు పాఠశాలలు, రెండు కాలేజీలు నేటికీ స్త్రీ అభ్యున్నతి కోసం ఎన లేని కృషి చేస్తున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గా బాయికి 1971లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.1975 – పద్మ విభూషణ్. అదే సంవత్సరం ఆవిడ భర్త సి.డి.దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, 1971 – నెహ్రూ లిటరసీ అవార్డుట వయోజన విద్యాసేవలకు గుర్తింపుగా వొచ్చింది. చైతన్య సేవా స్రవంతిగా అందరి నోటా కీర్తించబడ్డ దుర్గాబాయి...1981 మే 9వ తేదీన హైదరాబాదులో పరమపదించారు. అయితేనేం మరణం లేని ఓ వ్యవస్థగా ఆమె ఎప్పుడూ మన మధ్యనే చిరస్థాయిగా నిలిచి ఉంటారు.

## గర్భిణులకు అన్ని పరీక్షలు ఉచితం

**– ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తిరుమలశెట్టి పద్మజారాణి**

**రాజధాని ప్రతినిధి – గుంటూరు :** ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమం (పీఎంఎస్ఎంఎ)లో భాగంగా ఈ నెల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు అన్ని పరీక్షలు ఉచితంగా చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తిరుమలశెట్టి పద్మజారాణి చెప్పారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో నూతనంగా ప్రారంభించనున్న పథకంపై వైద్యాధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రతి నెలా 9వ తేదీన అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 4 నుంచి 6వారాల గర్భిణి, 7 నుంచి 9 నెలలు ఉన్న గర్భిణిలకు వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు జిల్లా ఆస్పత్రుల్లో ఉచితంగా స్కానింగ్ పరీక్షలు చేయాలని వెల్లడించారు. స్కానింగ్‌లు చేసే సమయంలో హైరిస్క్ ప్రెగ్నెన్సీ తెలుసుకుని తల్లీబిడ్డ సంరక్షన కార్డులపై రెడ్ స్టిక్కర్ వేసి మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయాలని తెలిపారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్నవారికి ఆశా,



అంగన్‌వాడీ వర్కర్‌ద్వారా ప్రతి నెలా 9వ తేదీ పరీక్షలు చేయించాలన్నారు. మాతా, శిశు మరణాలు తగ్గింపే లక్ష్యంగా నూతన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. దీనిని అందరూ చిత్తుశుద్ధితో సమర్ధవంతంగా అమలు చేయాలని వెల్లడించారు. సమావేశంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రెడ్డి శ్యామల, జిల్లా క్షయవ్యాధినివారణాధికారి డాక్టర్ యేపేరి కామేశ్వరప్రసాద్, జాతీయ ఆరోగ్యమిషన్ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ వై. రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్ జయంతి వేడుకలు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం శుక్రవారం పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. స్థానిక గంగానమ్మ గుడి సెంటరు వద్ద గల రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పట్టణంలో మండలంలోని పలు గ్రామాల్లో రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాలపద్మ, జిల్లా అధికార ప్రతినిధి పోల్నాటి బాబ్జి, సీనియర్ నాయకులు కనమతరెడ్డి బాబూరావు, మాజీ సర్పంచ్ మండవల్లి సోంబాబు, ముప్పిడి అంజి, పాశం రామకృష్ణ, చనమాల శ్రీనివాస్, కాసర సోమిరెడ్డి, మండల, పట్టణ నాయకులు రాఘవరాజు ఆదివిష్ణు, తాతకుంట్ల రవికుమార్, పాములపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి : మంత్రి రావెల



**రాజధాని, ప్రతినిధి- విజయవాడ:** బాబు జగ్జీవన్‌రామ్ 30వ వర్ధంతి సందర్భంగా స్థానిక రామవరప్పాడులోని ఆయన విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ రావెల కిషోర్‌బాబు బుధవారం ఉదయం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని అన్నారు. ప్రతి ఒక్కరు ఆయన బాటలో పయనించి దేశానికి పలు సేవలందించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ, స్థానిక నాయకులు విజయ్‌కుమార్, గొర్రెగాంధి, పి.వి ప్రసాద్‌రావు, మట్టాజయకర్, సాంఘిక సంక్షేమశాఖ సంయుక్త సంచాలకులు పి.యస్.ఎ ప్రసాద్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# నరసింహుని సన్నిధిలో గవర్నర్

**రాజధాని ప్రతినిధి – విజయవాడ :** రాష్ట్ర గవర్నర్ నరసింహన్ మంగళగిరి శ్రీపానకాల స్వామి, శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాలను గురువారం ఉదయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ నుంచి మంగళగిరి చేరుకున్న గవర్నర్ ఘాట్ రోడ్డులో నేరుగా కొండపైకి వెళ్లారు. శ్రీపానకాలస్వామికి నాలుగు బిందెల పటిక బెల్లం పానకం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆయన వెంట ఉన్నారు. దిగువ సన్నిధిలో శ్రీలక్ష్మి నృసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. కలెక్టరు కాంతీలాల్ దండే, దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసి, ధ్వజస్తంభం వద్ద సాస్టాంగ నమస్కారం చేశారు.



శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ మండపంలో ప్రధాన అర్చకస్వామి పద్మనాభాచార్యులు, ఉపప్రధాన అర్చకస్వామి నల్లూరి శ్రీరామచంద్రభట్టాచార్యులు, అర్చకస్వాములు గవర్నర్ నరసింహన్‌కు ఆశీర్వచనం పలికారు. పురపాలక సంఘం అధ్యక్షుడు గంజి చిరంజీవి, పాల్గొన్నారు.

**సుఖశాంతులతో జీవించాలి :**

ప్రజలంతా సుఖశాంతులతో జీవనం సాగించేలా దీవించాలని ఆదేవదేవుడ్ని కోరుకున్నానని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ అన్నారు. మంగళగిరి శ్రీపానకాల శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానములలో పూజలు నిర్వహించి తిరిగి వెళ్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి దీవెనలతో అందరూ సంతోషంగా జీవనం సాగించాలని ఆయన ఆకాంక్షించారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంద్ర బస్సు టైరు పంక్చర్

**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖా మంత్రి పీతల సుజాత చేతుల మీదుగా ఈ నెల 2న అట్టహాసంగా ప్రారంభించిన ఇంద్ర పాతబస్సు టైరుకు రెండు రోజులకే పంక్చర్ పడింది. ఈ నెల 4వ తేదీ జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాదు వెళ్ళిన బస్సు మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో హైదరాబాదు సమీపంలో ఎల్‌బీ నగర్ ప్రాంతంలో టైరుకు పంక్చర్ పడింది. దీనితో పంక్చర్ వేసి బస్సును సిద్ధం చేయడానికి సుమారు 2 గంటల సమయం పట్టిందని ప్రయాణీకులు తెలిపారు. అంత సమయం వేచి చూడలేని ప్రయాణీకులు వేరే ప్రయివేటు బస్సులను, ఆటోలను పట్టుకుని గమ్యస్థానాలకు చేరుకున్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూషణంను వివరణ కోరగా బస్సు టైరుకు పంక్చర్ పడిందన్నారు. తమ సిబ్బంది పంక్చర్ వేసి బస్సును సిద్ధం చేశారన్నారు. క్రొత్త బస్సులు వచ్చే వరకు ఈ బస్సులను తాత్కాలికంగా ఏర్పాటు చేసినట్లు డీఎం తెలిపారు. ఇదిలావుండగా ఇంద్ర బస్సులను రాష్ట్ర మంత్రి సుజాత ప్రారంభించిన రోజునే పలువురు వివిధ పార్టీల నాయకులు, ప్రయాణీకులు జంగారెడ్డిగూడెంకు డిపోకు మంజూరయిన ఇంద్ర బస్సులు పాతవి ఇచ్చారని, వీటిలో ప్రయాణం చేస్తే హైదరాబాదు చేరగలమా అని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఇంద్ర బస్సులు కొత్తవి వచ్చిన వెంటనే ముందుగా




జంగారెడ్డిగూడెంలో ఇంద్ర బస్సులను ప్రారంభించిన రాష్ట్ర మంత్రి సుజాత

జంగారెడ్డిగూడెం డిపోనకే వచ్చేటట్లు కృషి చేస్తానని ప్రయాణీకుల హర్షద్వనాల మధ్య హామీ ఇచ్చారు. ఈ రెండు ఇంద్ర బస్సుల స్థానే త్వరలోనే నూతన బస్సులు జంగారెడ్డిగూడెం డిపోకు కేటాయించాలని ప్రయాణీకులు ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఇంద్ర బస్సులు రాష్ట్ర మంత్రి సుజాత ప్రారంభించిన సమయంలో ఆర్టీసీ జిల్లా అధికారులు కూడా పాల్గనడం జరిగింది.

## జంగారెడ్డిగూడెంలో రంజాన్ పండుగ వేడుకలు



ఖబరస్థాన్‌కు తరలివెళ్తున్న ముస్లిం సోదరులు

**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెంలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బైనేరు సమీపంలో ఈద్‌గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు ముస్లిం మత గురువు హైదర్‌ఆలీరజ్వీ ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం ముస్లింలు ఈద్‌గా నుంచి అల్లాహెూ అక్బర్ అంటూ ముస్లిం శ్మశాన వాటికకు తరలివెళ్ళి వారి పూర్వీకులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిలాల్ మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ అక్బర్, మాజీ అధ్యక్షులు షేక్ బాజీ (టిప్‌టాప్), ముస్లిం నాయకులు ఎస్‌జీ షరీఫ్, ఎండి ఉమర్‌ఆలీ, షేక్ ముస్తఫా తదితరులు పాల్గన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా బిలాల్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో 200 మంది పేద ముస్లింలకు తోఫా సరుకులను, 120 మంది పేద ముస్లి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిలాల్ మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడెం పంచాయతీ సర్వతోముఖాభివృద్ధికి కృషి

**చైర్‌పర్సన్ శివలక్ష్మి, కమిషనర్ వెంకటేశ్వరరావు**

**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెం నగర పంచాయతీకి నూతన భవన నిర్మాణమును రూ. 1.64 కోట్లు వ్యయంతో త్వరలోనే చేపట్టనున్నామని చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, కమిషనర్ చోడగం వెంకటేశ్వరరావు తెలిపారు. నగర పంచాయతీ నూతన పాలకవర్గం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చైర్‌పర్సన్ శివలక్ష్మి, కమిషనర్ వెంకటేశ్వరరావు రాజధాని ప్రతినిధితో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా నగర పంచాయతీలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వారు మాట్లాడుతూ గతంలో భవన నిర్మాణ మునకు రూ.50 లక్షలు విడుదలైందని, అదనంగా సాధారణ నిధుల నుంచి రూ.1.14 కోట్లతో కలిపి శ్రీనివాసపురం రోడ్డులోని వారపుసంత వద్ద గల స్థలంలో నిర్మాణం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణం చేయడంలో ప్రథమస్థానంలో నిలిచిందని, ప్రస్తుతం 1831 వ్యక్తిగత మరుగుదొడ్లు రూ.2.70 కోట్లతో పూర్తిచేశామని, ఇంకను 164 నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. పట్టణంలో ఎన్టీఆర్ భరోసా క్రింద వృద్ధాప్య పింఛన్లు 1,484, వింతతు పింఛన్లు 1,298,



చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి

కమిషనర్ వెంకటేశ్వరరావు

వికలాంగుల పింఛన్లు 384, అభయహస్తం పింఛన్లు 132 మొత్తం 3,298 పింఛనుదారులకు 5 రెట్లు పెంపుదల చేసి నెల ఒక్కింటికి రూ.1000, రూ.1500 చొప్పున రూ.33 లక్షల 88 వేలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలో 766 స్వయం సహాయక సంఘములకు గాను 6991 సభ్యులకు పెట్టుబడి నిధి రూ.2,09,73,000 ప్రభుత్వం వారు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నగర పంచాయతీలో 2014-15 సంవత్సరమునకు గాను 263 దీపం కనెక్షన్లు అదనంగా మంజూరుచేసియున్నారని చైర్‌పర్సన్ శివలక్ష్మి, కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలో నూతనంగా రెండు సామూహిక మరుగుదొడ్లు నిర్మాణం చేయడం జరిగిందని, అదనంగా మరో రెండు మరుగుదొడ్లను త్వరలోనే నిర్మాణం చేయనున్నామని వివరించారు. స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా పట్టణంలో ఇంటింటికి చెత్తసేకరణ చేయుటకు గాను రూ. లక్షతో ఆరు ట్రైసైకిళ్ళను కొనుగోలు చేయడం జరిగిందని, దాతలు ఇచ్చిన రెండు ట్రైసికళ్ళతో కలిపి మొత్తం 8 ట్రైసికళ్ళతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పట్టణమునకు నాన్‌ప్లాన్ నిధుల నుంచి రూ.16 లక్షలతో అదనంగా, సాధారణ నిధుల నుంచి రూ.4 లక్షలు కలిపి మొత్తం రూ.20 లక్షలకు అశ్వారావుపేట రోడ్డు, ఏలూరు రోడ్డు నందు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రస్తుతమున్న ట్యూబ్‌లైట్లను తీసివేసి 2640 ఎల్ఈడీ లైట్లను ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు. జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ శేషాద్రినగర్ నందు అప్‌లాండ్ క్షత్రియ సేవాసమితి, నగర పంచాయతీ భాగస్వామ్యంతో సుమారు రూ.20 లక్షలతో శ్రీ అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్కు అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక సాయిబాలాజి టౌన్‌షిప్ కమిటీ, నగర పంచాయతీ భాగస్వామ్యంతో మున్సిపల్ పార్కు అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని వివరించారు. చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి మాట్లాడుతూ ప్రప్రథమంగా ఏర్పడిన నగర పంచాయతీకి చైర్‌పర్సన్‌గా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, 20 వార్డుల ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. దీనికి కౌన్సిలర్ల సహకారంతో పాటు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అనంతరం కమిషనర్ చోడగం వెంకటేశ్వరరావు మాట్లాడారు.

## ఆల్‌మేవా ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ



**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** ఆల్‌మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్‌మేవా) ఆధ్వర్యంలో పేదలకు పింఛన్‌లు పంపిణీ చేశారు. జంగారెడ్డిగూడెం సాయిమాధవి టవర్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది పేదలకు రూ.200 చొప్పున పంపిణీ చేసినట్టు ఆల్‌మేవా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ ఉమర్‌ఆలీ తెలిపారు. అలాగే వేరే ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 10 మందికి ప్రయాణపు ఛార్జీల కింద ఒక్కొక్కరికి రూ.50 అందించినట్టు చెప్పారు. అలాగే రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న 12 మంది పేద ముస్లింలకు నిర్మలా ఆసుపత్రి వైద్యులు లక్ష్మి ఆర్థిక సహాయంతో దుస్తులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్షీసైఫుద్దీన్, షాహెద్‌ఆలీ, అజహర్‌ఆలీ, భరత్ పాల్గొన్నారు. పలువురు ఆల్‌మేవా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమర్‌ఆలీ చేస్తున్న సేవలను కొనియాడారు.

# రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెం రోటరీక్లబ్ 3020 నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో జరిగింది. రోటరీ అసిస్టెంట్ గవర్నరుగా సిటీకేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా వెలివెల పెద్దిరాజు, కేవీ రామారావులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ గవర్నరు దామోదరరెడ్డి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పాలపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు కేటాయించిన రోటరీక్లబ్‌ల ద్వారా సేవలందించిగలనని అన్నారు. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దిరాజు, రామారావులు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం క్లబ్‌కు మంచి పేరు తీసుకురావడానికి సేవా కార్యక్రమాల్లో ముందంజగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రొటే రియన్ పీసీసీ అధికార ప్రతినిధి జెట్టి గురునాథరావు, కేఎల్ఎన్ ధనకుమార్, అచ్యుత శ్రీనివాసరావు, కోరా నాగేశ్వరరావు, జీపి ప్రసాద్, ఎస్ఆర్ఎంటీ రెడ్డి, జంగారెడ్డిగూడెం ఇండస్ట్రీస్ అధ్యక్ష, కార్యదర్శులు చామర్తి శ్రీరాములు, రాజాన పండు తదితరులు పాల్గొన్నారు.



అది విజయవాడ నగరానికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం. ఇంత కాలం అక్కడ నామమాత్రపు చిన్న ఘాట్ మాత్రమే ఉండేది. ప్రస్తుతం దాని రూపు రేఖలు మారిపోతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. ఆప్రాంతం జాతీయ స్థాయిలో మారుమోగుతోంది. అదే కృష్ణా-గోదావరి నదుల సంగమం ప్రాంతం. రోడ్లనిర్మాణం, ఆలయాల జీర్ణోద్ధారణ, అభివృద్ధి పనులు చేపట్టారు. ఇలా ప్రతీఘాట్‌ను అధికారులు ముస్తాబు చేస్తున్నారు.. ఆగస్టు 12 నుంచి 24వరకు జరిగే కృష్ణమ్మ పుష్కర ఏర్పాట్ల కోసం లక్షలాదిమంది భక్తులు ఎదురు చూస్తున్న విషయం విధితమే.. ఈ నేపథ్యంలో పుష్కర ఏర్పాట్లపై 'రాజధానివార్తలు' ప్రత్యేక కథనం

# ముస్తాబవుతున్న 'కృష్ణమ్మ'



## అక్షయపాత్ర సంస్థ ద్వారా భోజనవసతి



పుష్కర విధులకు పోలీసు సిబ్బంది, ఇతర ఉద్యోగులు అంతా కలిసి 60 వేల మంది వరకు తరలివచ్చే అవకాశం ఉంది. వీరందరికి అక్షయపాత్ర సంస్థ ద్వారా భోజన సదుపాయం కల్పించనున్నారు. ఆయా శాఖలు, సిబ్బందికి భోజన వసతి కల్పించే నిధులను అక్షయపాత్ర సంస్థకు కేటాయించాల్సి ఉంది. విజయవాడ నగరంలో 3 ప్రాంతాలలో అక్షయపాత్ర సంస్థ వంటశాలలు ఏర్పాటు చేసి 5 లక్షల మందికి ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉద్యోగులు పుష్కర విధులు నిర్వహించే చోటే ఆహారాన్ని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## దుర్గగుడి బందోబస్తుకు ప్రత్యేక ప్రణాళిక



ఈ పుష్కరాలలో పవిత్రసంగమం, పున్నమి, దుర్గాఘాట్‌ల నుండి కుమ్మరి పాలెం మీదుగా దుర్గగుడికి యాత్రికులు పెద్దఎత్తున తరలివస్తారు. అదే విధంగా అర్జున వీధి, బ్రాహ్మణ వీదిల నుండి కూడా గుడికి యాత్రికులు ఎక్కువగా రానున్నారు. ఈ రహదారులలో ప్రత్యేకమైన బందోబస్తు ఏర్పాటుపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిందిగా పోలీసు అధికారులకు కలెక్టరుకు కూడా సూచించారు.

## వివిధ కేటగిరిలో ఉద్యోగుల గుర్తింపుకు ప్రత్యేక జాకెట్



పుష్కర విధులు నిర్వహించే వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులను సులభంగా గుర్తించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన 'జాకెట్'లను ఇవ్వనున్నా మన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆకుపచ్చరంగు, పారా మెడికల్ సిబ్బందికి కాషాయ రంగు జాకెట్లలను ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు.

## పుష్కర సమయంలో నగరంలోని విద్యాసంస్థలకు సెలవు



పుష్కరాల సందర్భంగా నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు ఆగష్టు 8 నుంచి 25 వరకు సెలవును ప్రకటించనున్నారు. ఆయా సంస్థలకు చెందిన భవనాలలో పుష్కర విధులకు వచ్చే ఉద్యోగులకు వసతి కల్పించనున్నారు. అన్ని భవనాలను తప్పనిసరిగా ఇందుకు ఇవ్వాల్సి వుంటుందని ఏ సంస్థకు దీని నుంచి మినహాయింపు లేదని కలెక్టరు స్పష్టం చేశారు. పుష్కర విధుల నిర్వహణలో పూర్తిస్థాయి శక్తి సామర్థ్యాలు వినియోగించేలా ఉద్యోగులు పనిచేసేందుకు తగు సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగానికి ఉందన్నారు. ఆయా భవనాలలో తాత్కాలిక మరుగుదొడ్లు, నీటి సదుపాయం ఫ్యాన్‌లు తప్పనిసరిగా వుండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు సూచించారు.

## ఇక్కడి నుంచే..కృష్ణా హారతి



పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా గోదావరి నీటిని కృష్ణానదిలో కలిపి నదుల అనుసంధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పట్టి సీమ ఎత్తిపోతల ద్వారా గత ఏడాది దాదాపు 8టీఎంసీల నీటిని కృష్ణా బ్యారేజీలో కలిపారు. ప్రస్తుతం ఈనెల 10 నుంచి 8,500 క్యూసెక్కులు నిరంతరం రానున్నాయి. గోదావరి నీరు కృష్ణానదిలో కలిసే ప్రాంతాన్ని పవిత్ర సంగమంగా వ్యవహరిస్తున్నారు. ఈఏడాది కృష్ణా పుష్కరాలు రావడంతో ఈసంగమం ప్రాంతం ప్రత్యేకత సంతరించుకుంది.

ఆగస్టు 12 నుంచి ప్రారంభం అయ్యే పుష్కరాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇక్కడి నుంచి ప్రారం భించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. యాత్ర స్థలంగా, పర్యాటక ప్రాంతంగా దీన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలో ఫెర్రీ గ్రామం ఉంది. ఇక్కడే పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి వచ్చిన గోదావరి నీరు కృష్ణానదిలో కలుస్తుంది.

## యాత్రికులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు

- గవర్నర్ ఇ.ఎల్.నరసింహన్

**రాజధానిప్రతినిధి, విజయవాడ :** రానున్న నెల రోజుల్లో కృష్ణా పుష్కరాలు ప్రతిష్టాత్మకంగా నిర్వ హించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర గవర్నర్ ఇ.ఎల్.నరసింహన్ అన్నారు. విజయవాడ పర్యటనలో భాగంగా రెండో రోజైన గురువారం ఆయన స్థానిక కనకదుర్గ అమ్మవారిని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద తమను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పుష్కర యాత్రికలకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం పుష్కర మౌలికర సదుపాయాలు, ఘాట్ల నిర్మాణంపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గవర్నర్‌కు మ్యాప్‌ల ద్వారా వివరించారు. దుర్గాఘాట్ ను సుమారు 2.3 కి.మీ మ పొడవున కృష్ణానదికి అభిముఖంగా అభివృద్ధి (రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్) పరుస్తున్నట్లు వివరించారు. కేవలం పుష్కరాలు పనులు గానే కాక, విజయవాడ నగరానికి శాశ్వత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తెచ్చే నిర్మాణాలుగా ఘాట్లను అభివృద్ధి పరుస్తున్నట్లు మంత్రి గవర్నర్‌కు వివరించారు. కృష్ణా, గోదావరి నదుల్ని కలిపే పవిత్రసంగమం వద్ద 25 ఎకరాల్లో పుష్కర యాత్రికులకు అన్ని వసతులతో కూడిన మౌలిక సదు పాయాలను, పుష్కర ఘాట్లను నిర్మిస్తున్నట్లు మంత్రి గవర్నర్‌కు వివరించారు. దుర్గగుడి వద్ద నిత్యం ట్రాఫిక్ రద్దీని సమర్థవంతంగా ఎదు ర్కొనేందుకు ఆరువరుసల ఫ్లైవోవర్, దాని దిగువ 4 వరుసల రహదారి నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు.



పుష్కరాల వివరాలు తెలుసుకుంటున్న గవర్నర్ నరసింహన్

## ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం : కలెక్టర్ బాబు. ఎ



**రాజధాని, ప్రతినిధి - విజయవాడ :** పుష్కర విధులు నిర్వహిం చేందుకు వచ్చే పోలీసులు, సాధారణ ఉద్యోగులు, ఆయా పుష్కర ఘాట్లు, పుష్కర నగర్‌లు సమీపంలోనే వసతి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీ బాబు.ఎ తెలిపారు. ఇందుకు అను గుణంగా శాఖాధిపతులు తమ శాఖ నుండి పుష్కర విధులకు రప్పిస్తున్న ఉద్యోగుల వసతికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి రెండు రోజుల్లోగా తమకు పంపాలని కలెక్టర్ పేర్కొన్నారు.

స్థానిక కలెక్టరు క్యాంపు కార్యాలయంలో బుధవారం పుష్కర విధులు నిర్వహించే పోలీసులు, ఉద్యోగుల కోసం వసతి ఏర్పాటు చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పుష్కర ఘాట్‌కు, పుష్కర నగర్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థల భవనాల జాబితాను తక్షణమే ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారికి కలెక్టరు ఆదేశించారు. వీటి ఆధారంగా పుష్కర విధుల నిర్వహించేందుకు వచ్చే పోలీసులు, ఉద్యోగులకు వసతి సదుపాయం ఏర్పాటు చేస్తామన్నారు. పుష్కరాల ప్రారంభానికి 72 గంటల (3 రోజులు) ముందుగానే ఆయా ఉద్యోగులు తమకు కేటాయించిన ప్రదేశంలో విధులకు హాజరై అక్కడి పని వాతావరణానికి అలవాటు పడాలన్నారు. పోలీసులు ఘాట్ల వారిగా పుష్కర నగర్‌ల వారిగా బందోబస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా కనకదుర్గ గుడి ఇతర ప్రాంతాలలో సాధారణ బందోబస్తు ప్రణాళికను కూడా ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు.

విజయవాడ నగరంలోని ప్రధానంగా పద్మావతి ఘాట్, కృష్ణవేణి ఘాట్, దుర్గా ఘాట్, పున్నమి ఘాట్, పవిత్రసంగమం వద్ద ఘాట్‌లలో సుమారు ఆరు కిలో మీటర్ల మేర 85 శాతం మంది పుష్కర యాత్రికులు పవిత్రస్నానాలు ఆచరిస్తారన్నారు. ఈ ప్రాంతాలలో యాత్రికులకు అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని అన్నారు. ఇందుకోసం ముందుగా ఉద్యోగులు, పోలీసులు సౌకర్యవంతమైన వసతి భోజన సదు పాయాలు ఏర్పాటు చేయడం అత్యంత అవసరమన్నారు. 500 మీటర్లకు మించి దూరం వుండ కుండా జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. అవసరమైన పక్షంలో దగ్గరలోని ప్రయివేటు భవనాలను, ఇళ్లను కూడా అద్దెకు తీసుకుని అయినా వసతి కల్పించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## పుష్కర కాల్ సెంటర్ల ఏర్పాట్లు



పుష్కర సమాచారం తెలపడంతో పాటు వివిధ హోదాల్లో వున్న ముఖ్యుల (విఐపి) పర్యటనలు ముందుగానే తెలుసుకొని సాధారణ యాత్రికులకు అసౌకర్యం కలగకుండా, ముఖ్యులకు తగు ఏర్పాట్లు చేసేందుకు వీలుగా పుష్కర కాల్ సెంటర్‌ను ఏర్పాట్లు చేయనున్నారు. సుమారు 10 మంది ఉద్యోగులు నిరంతరం కాల్ సెంటర్‌లలో సమాచారం ఇవ్వడం లేదా తెలుసు కోవడం చేపడతారు. వసతి సదుపాయల కల్పనకు, విద్యాసంస్థ భవనాలను ఇచ్చేందుకు నిరాకరించడం వీలుకాదు. 1954 పబ్లిక్ ప్లేసెస్ చట్టం ప్రకారం ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ, ప్రయివేటు భవనాలను తీసుకునే విచక్షణాధికారం జిల్లా మెజిస్ట్రేట్ అయిన కలెక్టరుకు ఉంటుంది. ప్రతి ఘాట్, పుష్కర నగర్‌లో మూడు షిఫ్టులలో ఉద్యోగులు పనిచేసే విధంగా ఎంతమంది అవసరమ వుతారో వారికి ఎంతమేర వసతి కావాలో సమాచారం ఇవ్వాల్సిందిగా ఆయన అధికారులను కలెక్టర్ ఆదేశిస్తారు. పుష్కర విధులు నిర్వహించే వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులను సులభంగా గుర్తించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన 'జాకెట్' లను ఇవ్వనున్నామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆకుపచ్చరంగు , పారామెడికల్ సిబ్బందికి కాషాయ రంగు జాకెట్లలను ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు.

# నత్తనడకన... పుష్కర పనులు..!




- పుష్కరనగర్‌లకు ఖరారు కాని టెండర్లు
- తాగునీరు, శానిటేషన్‌లదీ అదే పరిస్థితి
- గుంటూరులో రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తం

**ఋరాజధాని ప్రతినిధి - అమరావతి :** జిల్లాలో పుష్కర పనులు నత్తనడకన సాగుతున్నాయి. పుష్కరాలకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి సమీపంలోని ఆలయాల్లో పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లాలోని ఆలయాలను అందంగా తీర్చిదిద్ది పుష్కర శోభ వచ్చేలా చేసేందుకు దేవాదాయశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. 276 పునులను దాదాపు రూ.20 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు సైతం మంజురయ్యాయి. అయితే, ఈ పనులు ముందుకు సాగట్లేదు. ఇంకా 34 పనులు టెండర్ దశలోనే ఉన్నాయి. దైదా, సత్రశాల, అమరావతి, సీతానగరం, పెనుమూడి, మూరతోట, చిలుమూరు, శైవక్షేత్రంలో పాటు జిల్లాలోని పలు దేవాలయాలకు పుష్కర శోభ తెచ్చేందుకు వీలుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో ఎక్కువ శాతం పనులు ప్రారంభ దశలోనే ఉండటం గమనార్హం. ఈ పనులే కాకుండా ప్రధాన దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీసు శాఖ సమన్వయంతో బారికేడ్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం ప్రణాళికలు రచించాల్సి ఉంది. పుష్కరాలకు గుంటూరు జిల్లాలో ఏర్పాటుచేసిన ఘాట్లకు రోజుకు తొమ్మిది లక్షలు మంది భక్తులు వస్తారని అధికారుల అంచనా తాగునీటి కోసం ఋరూ.1.78 కోట్లు, శానిటేషన్ కోసం రూ.1.88 కోట్లు సంబంధించి ఇంకా టెండర్లు ఖరారు. కాలేదు. వెయ్యి మరుగుదొడ్ల ఏర్పాటు దిశగా అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. 49 ఘాట్లలో బోర్లు, మిగిలినచోట తాగునీరు సరఫరా చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.3.57కోట్ల పనులు చేసేందుకు వీలుగా నిధులు మంజురయ్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్లు ఖరారు కావాల్సి ఉంది. ఇంకా పుష్కరనగర్‌ల ఏర్పాటుకు సంబంధించిన పనులకు టెండర్లు పిలవలేదు. గుంటూరు నగరంలో 6,7కిలోమీ టర్లకు సంబంధించిన డ్రైయినేజీలు పూర్తికాకపోవడం, విద్యుత్ స్తంభాలు షిఫ్టుచేయకపోవడం రహదారి పనులకు అడ్డుగా మరింది. గుంటూరు రోడ్డు, ఏటుకూరు రోడ్డు, అమరావతి, పొన్నూరు రోడ్డులో డ్రైయిన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పుష్కరాలకు సంబంధించి బందోబస్తు, పుష్కర నగర్‌లు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సమాలోచనలు చేశారు.



**అప్రోచ్ రోడ్లదీ అదే దారి :** పంచాయితీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 100 పనులకు సంబంధించి రూ.66.76 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఇందులో 84 అప్రోచ్ రోడ్లు, 14 భవనాలున్నాయి. ఇంకా ఐదు పనులకు సంబంధించి టెండర్లనే పిలవలేదు. 33 పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తికాలేదు. ప్రారంభమైన పనుల్లో సైతం ఘాట్‌లను అనుసంధానం చేసే ప్రాధాన్యత పనులు మందకొడిగా సాగుతున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధుల ఒత్తిడితో పుష్కరాలకు సంబంధం లేని పనుల్లో కొన్నింటిని కాంట్రాక్టు కోసమే అన్నట్టు చేపడుతున్నారు. అనుపు పుష్కర ఘాట్‌కు వెళ్లే రోడ్లు, పొందుగుల, దాచేపల్లె వంటి చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి.



గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే జరిగిన అధికారుల సమావేశంలో సైతం 'కాంట్రాక్టుల కోసం కాకుండా ప్రాధాన్యత గల పంచాయితీరాజ్ శాఖ ఎస్‌ఈని ఆదేశించడం గమనార్హ, ప్రాధాన్యత గల పనులు పూర్తికాకపోతే ఇబ్బంది పడతారని, జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొనడం విశేషం.

# ముందుకు సాగని సర్వే

- పలు ప్రాంతాల్లో సిగ్నల్స్ లేక అవస్థలు
- రోజుకు 4.20 లక్షల ఇళ్ల సర్వే ప్రభుత్వ లక్ష్యం



**రాజధాని ప్రతినిధి,గుంటూరు :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సాధికార సర్వే (స్మార్ట్ పల్స్ సర్వే) తొలి రోజు పలు జిల్లాలో ఎన్నో ఇబ్బందుల మధ్య ప్రారంభమయ్యింది. పలు ప్రాంతాల్లో సిగ్నల్స్ లేకపోవడంతో సర్వే నివేదికను అప్‌లోడ్ చేసేందుకు ఎన్యూమరేటర్లు, ఇతర అధికారులు నానా పాట్లు పడ్డారు. గుంటూరు జిల్లాలో తాడేపల్లి మండలం ఉండవల్లిలో నివాసం ఉంటున్న ముఖ్యమంత్రి తన కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్‌లకు అందజేసి సర్వేను ప్రారంభించారు. అనంతరం అన్ని జిల్లాలో సర్వే బృందాలు వారికి కేటాయించిన ఎన్యూమరేషన్ బ్లాక్(ఈబి)లో సర్వే నిర్వహించేందుకు వెళ్ళగా ఫలితాలు నామమాత్రంగానే ఉన్నాయి. ప్రభుత్వం ఒక్కో బృందం రోజుకు 14 ఇళ్ళను సర్వే చేయాలని నిర్ణయించింది. తొలిరోజైన ఎన్యూమరేటర్‌ల బృందం రోజుకు 2నుంచి3 ఇళ్ళలో సర్వే పూర్తి చేయడం కష్టంగా మారిందని అధికారులు తెలిపారు. ఒక్క కృష్ణా జిల్లాలో ఒక్కో సర్వే బృందం 4 ఇళ్లను సర్వే చేయగా మిగిలిన జిల్లాలో 1నుంచి 3 ఇళ్ళలో మాత్రమే సర్వే చేసి ఆ డేటాను అప్‌లోడ్ చేశారు. ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న గుంటూరు జిల్లాలో అప్‌లోడ్ అయిన వివరాలను పరిశీలిస్తే 62 ఎన్యూమరేటర్‌లు 104 ఇళ్ళలో సర్వే పూర్తి చేసి 175 మంది వివరాలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో సర్వే ప్రారంభం కాలేదని నివేదికలు చెబుతున్నారు. ఈ మండలాల్లో అధిక శాతం ల్యాబ్‌లకు సిగ్నల్స్ లేక, సర్వర్ పనిచేయకపోవడంతో సర్వే వివరాలను అప్‌లోడ్ చేయలేక పోయినట్లు అధికారులు చెబుతున్నారు. సర్వే ప్రారంభమయిన మండలాల్లోను కేవలం పదుల సంఖ్యలో సర్వే పూర్తి చేసిన ఇళ్ళ దాఖలాలు కనిపించలేదు. కేవలం 2 నుంచి 10 లోపు ఇళ్ళలో మాత్రమే సర్వేను పూర్తి చేశారు. పల్నాడు ప్రాంతంలో ఉన్న వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, రెంటచింతల, అమరావతి, అమర్తలూరు, అచ్చంపేట, చేబ్రోలు, చిలకలూరిపేట, దుగ్గిరాల తదితర మండలాల్లో సర్వే నమోదు కాలేదు. సర్వే కోసం వెళ్ళిన అధికారులు సాంకేతిక సమస్యలు పరిష్కారం ఉంది. వారి నుంచి 20 అంశాలకు సంబంధించి వివరాలు తెలుసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. దీంతోపాటు వారి వేలి ముద్ర, ఐరిస్‌ను ఆన్‌లోడ్ చేసుకోవాల్సి రావడం వల్ల సర్వే ఆలస్యం అవుతుందని ఎన్యూమరేటర్‌లు చెబుతున్నారు.

**సర్వే నమోదు వివరాల్లోకి వెళితే...**

రాష్ట్ర వ్యాప్తంగా సర్వే పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదయిన వివరాలను పరిశీలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో 3,251 సర్వే బృందాలు 8,358 కుటుంబాలను సర్వే చేయగా,పట్టణ ప్రాంతాల్లో 442 సర్వే బృందాలు 1,027 ఇళ్ళను సర్వే చేశాయి. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపుగా అన్ని జిల్లాలో సర్వే వివరాలు నమోదవగా, పట్టణ ప్రాంతాల్లో నెల్లూరు, విజయనగరం జిల్లాలో సర్వే వివరాలు నమోదు కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో కృష్ణా జిల్లా అన్నింటి కంటే ముందు నిలిచింది. రాష్ట్రంలోనే అత్యధికంగా 675 మంది సర్వే బృందాలను రంగంలోకి దింపి 2,710 ఇళ్ళలో సర్వే పూర్తి చేసింది. రాష్ట్రంలోని ఇతర ఏ జిల్లా ఈ సంఖ్యకు సమీపంలో లేకపావడం విశేషం. పట్టణ ప్రాంతాల్లో విశాఖపట్టణం అత్యధికంగా 217 సర్వే బృందాలతో 486 ఇళ్ళలో సర్వే పూర్తి చేసింది. కడప జిల్లా అత్యల్పంగా కేవలం 51 సర్వే బృందాలతో 97 ఇళ్ళలో మాత్రమే సర్వే చేయగలిగింది. సర్వే వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదువుతున్నాయి. ఏ జిల్లాలో ఏ మండలంలో మండల సూపర్‌వైజర్, ఎన్యూమరేటర్‌లు, మాస్టర్ ట్రైనర్ వారి వివరాలను ప్రతి రోజు నమోదు చేయాల్సి ఉంటుంది. తొలిరోజే ఆశించిన స్థాయిలో సర్వే జరగకపోవడం అధికారులను నిరుత్సాహ పరిచింది.

**సాంకేతిక సమస్యలు ఎన్నో...**

సర్వే నిర్వహణలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, ఏజన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన టాబ్‌లకు సిగ్నల్స్ అందకపోడంతో వివరాలు అప్‌లోడ్ చేయడం సాధ్యం కావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్ ఉన్న సర్వర్ సక్రమంగా పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు. మరికొన్ని చోట్ల అన్నీ పనిచేసినా సిబ్బందికి ట్యాంబ్‌లతో సర్వే చేయడం, వాటిని ఆపరేట్ చేయడంలో పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో సమస్యలు తలెత్తు ఉన్నాయి. సాక్షాత్తూ ముఖ్యమంత్రి నివాసం ఫొటో సరైంది అప్‌టోడ్ చేయకపోవడం అనేక విమర్శలకు తావిస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా కేవలం 31 రోజుల్లో సర్వే పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ప్రతి గ్రామంలో 430 నుంచి 460 ఇళ్ళను ఒక ఎన్యూమరేషన్ బ్లాక్‌గా నిర్ణయించారు.

ప్రజలు వివరాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది. గుంటూరు జిల్లాలోని వెల్దుర్తిలోని ఒక ఇంటికి వెళ్ళిన ఎన్యూమరేటర్‌కు యజమాని వివరాలు చెప్పననడంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఇన్ని సమస్యలతో సర్వే ఎప్పటికి పూర్తివుతుందనేది ప్రశ్నార్థకం.

## ఆశాజ్యోతి వికలాంగుల మధ్య చలసాని పుట్టిన రోజు వేడుక



వికలాంగులకు భోజనం పెడుతున్న చలసాని

**రాజధాని ప్రతినిధి,దేవసహాయం -హనుమాన్‌జంక్షన్ :** తెలుగుదేశం పార్టీ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు చలసాని ఆంజనేయులు పుట్టిన రోజు సందర్భంగా ఆయన మానవతా ధృకృధంతో ఆశాజ్యోతి వికలాంగ విద్యార్థుల మధ్య పుట్టిన రోజు వేడుకను జరుపుకున్నారు. విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వారిమధ్య విందును చేసి వారితో పుట్టినరోజు వేడుక జరుపుకున్నారు. చలసానికి ఆశాజ్యోతి విద్యార్థులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమానికి బాపులపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ కొల్లి వెంకట్రావు,తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.ఈ.డి బల్బులు పంపిణీ చేసిన వంశీ



**రాజధాని ప్రతినిధి,దేవసహాయం- హనుమాన్‌జంక్షన్ :** బొమ్ములూరు గ్రామ ప్రంచాయితీలో శాసన సభ్యులు డా: వల్లభనేని వంశీమోహన్ చేతులమీదుగా గ్రామానికి అవసరమైన వీధిదీపాలను (ఎల్.ఈ.డి) బహుకరించారు. దీనికి సబందించిన నిధిని స్మార్ట్ విలేజ్ పార్టనర్,జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు రామాంజనేయులు, పంచాయితీ నిధి కోఆపరేటర్ బ్యాంక్ వారు సంయుక్తంగా సమకూర్చారు. గ్రామంలోని మూడు అంగన్‌వాడీ పాఠశాలలకు రామాంజనేయులు ఫ్యాన్‌లను సమకూర్చారు. గ్రామాభివృదికి గ్రామ స్థులందరు కృషిచేయాలని రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో సర్పంచ్ మట్టా రాజేశ్వరి,గ్రామపార్టీ అధ్యక్షులు యర్రంశెట్టి సత్యనారాణ,వీరమాచనేని సత్యప్రసాద్,కొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్యలు పాల్గొన్నారు.

## ఈ విద్యాసంవత్సరానికి సీట్లు ఫుల్

– ఎన్‌డీఏ ప్రిన్సిపాల్



**రాజధాని ప్రతినిధి - విజయవాడ :** రెండో ప్రపంచ యుద్ధకాలాని కంటే ముందే బ్రిటీషువారు విద్యకు ప్రాముఖ్యతనిచ్చి అనేక విద్యా సంస్థలను భారతదేశంలో ప్రవేశ పెట్టారని, అందులో సెవెంత్‌డే ఎడ్వంటిస్ట్ ఒకటని ప్రిన్సిపాల్ ఉందర్శి రాజన్‌బాబు తెలిపారు. అతితక్కువ ఫీజుతో అత్యాధునిక ఐసీఎస్ఈ సీలబస్‌తో ఎల్‌కేజీ నుంచి పదవతరగతి వరకకు విద్యనందిస్తున్న సంస్థ ఎస్‌డీఏ స్కూలని హెడ్ మాస్టర్ తుమ్మలాపల్లి సత్యదేవం తెలిపారు. యాభై ఏళ్లనుంచి తమ విద్యాలయం ఎంతోమంది పేద, మధ్యతరగతి వర్గాలకు విద్యనందించిందన్నారు. ఈ ఏడాదికూడా వందశాతం ఉత్తీర్ణత సాధించిన మా విద్యాసంస్థ పేద విద్యార్థులకు విదేశీ దాతల ద్వారా విద్యనందిస్తున్నామని తమ సంస్థ లాభాపేక్షలేని విద్యాసంస్థని రాజన్ బాబు చెప్పారు. ఐసీఎస్ఈ సిలబస్‌తో విద్యను బోధించాలంటే అత్యున్నత విద్యతోపాటు ఉన్నత ప్రమాణాలు గల అద్యాపక బృందం అవసరమవుతుందని,తమ స్కూల్‌లో టీచర్లందరూ కేంద్ర ప్రభుత్వ నియమనిబంధనలకు అనుగుణంగా నియమితులైనవారేనన్నారు. సీబీఎస్‌సీకే లక్షల రూపాయలు వసూలు చేస్తున్నా...అంతర్జాతీయ విద్యను అందిస్తున్నా తమ సంస్థ అతితక్కువ ఫీజులను వసూలు చేస్తున్నామన్నారు. గత 50 ఏళ్లుగా విజయవాడలో విద్యనందిస్తూ నగర అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నామని రాజన్‌బాబు వెల్లడించారు.

# జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నిరీక్షణ ఫలించింది

**హనుమాన్‌జంక్షన్ రాజధానివార్తలు:** జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఎంపీలు కొనకళ్ళ నారాయణ, మాగంటి బాబు, ఎమ్.ఎల్.ఎ వల్లభనేని వంశీమోహన్,ఎమ్.ఎల్.ఎ చింతమనేని ప్రభాకర్‌లు జండా ఊపీ నూజివీడు రైల్వేస్టేషన్(హనుమాన్‌జంక్షన్)లో ప్రారంభించారు. విశాఖపట్నం నుండి హైదారాబాద్ వెళ్లే ఈ రైలును ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని, అందుకు సహకరించిన మంత్రి సురేష్‌ప్రభుకు మాగంటి కృతజ్ఞతలు తెలిపారు. షీర్డీ ఎక్స్‌ప్రెస్ కూడా ఇక్కడ ఆగేవిధంగా చేయాలని వారు సురేష్ ప్రభును కోరారు. చింతమనేని మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో సదుపాయాలు కల్పించి,ఫుట్‌వర్క్ పనులు చేయించాలని, ప్లాట్‌ఫామ్ ప్లేఓవర్ బాగుచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

కొనకళ్ళ మాట్లాడుతూ ఈ స్టేషన్‌కు నిధులు మంజూరు చేశామని మరింత ఆభివృద్ధి చేయటానికి కృషి చేస్తామన్నారు .ఈకార్యక్రమంలో బాపులపాడు తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ కొల్లి వెంకట్రావు,జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు చలసాని ఆంజనేయులు,శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ డి.ఆర్.ఎమ్ అశోక్‌కుమార్ బాపులపాడు సర్పంచ్ కాకాని అరుణ, ఉపసర్పంచ్ కాకాని బాబ,చెన్నుబోయిన శివయ్య,అట్లూరి రమేష్,ఏపూరు సర్పంచ్,వేగిరెడ్డి పాపారావు,ఎమ్.పి.పి తుమ్మల కోమలిలు పాల్గొన్నారు.



జండా ఊపుతున్న మాగంటి,చింతమనేని, కొనకళ్ళ,వల్లభనేని

## లంక భూములను రీసర్వే చేయాలి

– వ్యవసాయకార్మిక సంఘం డిమాండ్

**రాజధాని ప్రతినిధి - తుళ్ళూరు :** రాజధాని ప్రాంతంలో లంక భూముల సర్వే లోపభూయిష్టంగా ఉందని, రీసర్వే చేయాలని వ్యవసాయకార్మిక సంఘం తాడికొండ ఏరియా అధ్యక్షులు చింతరాల కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మండలంలోని రాయపూడిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుళ్ళూరు మండలం రాయపూడి లంకల్లో ఎన్నో ఏళ్లుగా దళితులు లంక భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అయన చెప్పారు. దళితులకున్న కొద్దిపాటి లంక భూములను ప్రభుత్వం ఇటివల సర్వే జరిపిందని, అయితే సర్వేలో భూమి విస్తీర్ణాన్ని తగ్గించి నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 సెంట్లు ఉన్న భూమిని 10, 15, 20 సెంట్లుగా పేర్కొనడం దారుణమని, తక్షణమే అధికారులు మరోసారి లంక భూములను సర్వే చేయాల్సిన ఆగత్యం ఉందన్నారు. ఈ విషయమై కొంత మంది దళితులు కోర్టులను అశ్రయించే యోచనలో ఉన్నారని ఆయన వివరించారు. కొన్ని లంక భూములను కొనుగోలు చేసినట్లుగా కొంత మంది స్టాంప్‌పేపర్లపై సంతకాలు చేయించుకున్నారని చెబుతూ అటువంటి కొనుగోలు దారుల పేర్లను భూముల జాబితాలో పేర్కొన్నారని మండిపడ్డారు. నిజమైన లబ్ధిదారులను జాబితాలలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి లంక భూములను రీసర్వే చేసి తగు న్యాయం చేయాలని, లేనిపక్షంలో సాగుదారులను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం నాయకులు కంభంపాటి దేవునిదయ, కంభంపాటి స్వామి పాల్గొన్నారు.

## ఈశ్వరాను గ్రహంతోనే మంచి వర్షాలు : వేణునాథ్ సిద్ధాంతి


**రాజధానిప్రతినిధి, విజయవాడ :** సహజంగా ఋతుపవనాలు నైరుతి నుండి భారతదేశంలోకి ప్రవేశిస్తుంటాయని, వరుణదేవుడు ఎక్కడ పరిపాలనలో ఉంటే అక్కడ ఆకర్షణతో వర్షాలు కురుస్తుంటాయని, ప్రముఖ సిద్ధాంతి ఆకుల వేణునాథ్ తెలిపారు. ఉత్తర భారత దేశంలోని హిమాలయాలు జ్యోతిర్లింగాలు కాశీ, కేదార్ అనేక శివ లింగాలకు నిత్యం ఏకాదశ, రుద్రాభిషేకాలు జరపటంవల్ల రుతుపవనాలు ఆకర్షణపొంది, పార్వతిదేవి సహకారంతో ఈశ్వరానుగ్రహం వల్ల వర్షాలు కురుస్తుంటాయని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 1996 నుండి 2003 వరకు వర్షాలు అనుకూలించకపోవుటానికి కారణం వరుణదేవుడు పడమర నైరుతి నుండి వాయువ్యం వరకు పరిపాలిస్తూ, ఉత్తర ఈశాన్య దిక్కుకు ప్రయాణించడమేనన్నారు. , ఆంధ్రప్రదేశ్ రాయలసీమ దక్షిణ నైరుతి నుండి ఈశాన్యం శ్రీకాకుళం వరకు కోస్తా భాగంలో ఉంది. కాని ఇక్కడ వర్షాలు పడవు, కారణం దక్షిణ నైరుతి జిల్లాలలో అభిషేకాలు తక్కువ



దీంతో వర్షాభావ పరిస్థితులు నెల కొంటున్నాయి. దీని నివారణ కోసం రాయలసీమలోని ప్రతి పల్లెలో జలంతో అభిషేకాలు, సహస్ర రుద్రాభిషేకాలు నిర్వహిస్తే దక్షిణ భాగంలో వర్షాలు కురిసి ఆ తర్వాత వాయువ్య ఉత్తర భాగంలో వర్షాలు కురుస్తాయని వేణునాథ్ అన్నారు. దేవుడు ముందు మనకే అవకాశం ఇచ్చినా మనకు వినియోగించుకోవడలం రావడం లేదని, కనీసం చైత్రమాసం నుండి బాద్రపదమాసం వరకు నిత్య అభిషేకాలు రాయలసీమలో ప్రతి శివలింగాలు మీద అభిషేకాలతో వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకోవచ్చని ఆయన విశదీకరించారు.

జూన్‌లో వచ్చే ఆరుద్రా కార్తి/ జూన్‌లో మిథున సంక్రాంతి మృగశిర నక్షత్రం 3వ పాదం ప్రవేశం నుంచి ఆశ్లేష 4 వ పాదం కార్తి వరకు విశేషమైన కుంభాభిషేకాలు, 108 లేదా 1000 కుండల నీళ్లతో అభిషేకాలు చేస్తే రాయలసీమే మాత్రమే కాకుండా రాష్ట్రం అంతా రత్నాలసీమగా పాడిపంటలతో కళకళలాడుతుందని ఆయన సెలవిచ్చారు. నిజానికి రాయలసీమలో కోటీశ్వరులు ఉన్నారనీ, ఉత్తర భాగం కంటే దక్షిణ భాగంలోని ఆలయాల్లో ఈశ్వరానుగ్రహం పొందడం సులభంఅని, అందుకే ఈశ్వరుడు దక్షిణామూర్తిగా ప్రసిద్ధి చెందాడని ఆయన తెలిపారు. రాయలసీమ ప్రముఖులు టి.జి.వెంకటేష్‌గారు, మోహన్‌బాబు శివలింగాభిషేకం, శివప్రేరణ శక్తి, సినిమా చేసి ఈశ్వరానుగ్రహం పొందారన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని మాన్యులంతా శివానుగ్రహం కోసం అభిషేకాలు జరిపితే రాష్ట్రం అభివృద్ధి పథాన నడుస్తుందని ఆయన ఘంటాపథంగా చెబుతున్నారు. అంతే కాని నారా చంద్రబాబు నాయుడు వల్ల మన రాష్ట్రంలో వర్షాలు కురియట్లేదు అనుకోవటం తప్పని వేణునాథ్ సిద్ధాంతి విశదీకరించారు.

# పుష్కర కాలంలో..పిత్రృ శ్రాద్ధాలు



**(చెరువూరి శివరామకృష్ణ)** నదీ పుష్కర పవిత్ర కాలాల్లో పితృశ్రాద్ధాలు పెడుతుంటారు. ఈ పితృదేవతారాధనకు కారణాలను గమనించాలి. హిరణ్య గర్భుని కుమారుడు మనువు. అతని పుత్రులు మరీచి మొదలయినవారు. ఆ దేవర్షుల కుమారులే పితృదేవతలు. వీరు దేవతలకు తండ్రులు, మానవులకు మూల పురుషుడు. వీరిలో సోమపులను విప్రులు,హవిర్భుజులను క్షత్రియులు, ఆజ్యపులను వైశ్యులు, సుకాలీనులను శూద్రులు ఆరాధించాలి. కాబట్టి పవిత్ర కాలాల్లో దేవతలకు పూర్వులు, ప్రాణులకు మూల పురుషులయిన పితృదేవతలను ఆరాధించాలి. అమావాస్య, సంక్రాంతి, పుష్కరాలు, మహాలయపక్షం, తమ పితృలు మరణించిన తిథులు మొదలయినవి పవిత్ర కాలాలు. ఆ కాలాల్లో పితృలకు శ్రాద్ధం,పిండదానం, తర్పణం చేస్తే వారా నందించి అనుగ్రహిస్తారు. పితృదేవతల ఆశీస్సుల వలన శ్రాద్ధం పెట్టిన వారి వంశములో దాతలు, విద్యావంతులు, శ్రద్ధ గలవారు, ఆయుష్మంతులు, కీర్తి, మేధ, ధనం, సంతానం గలవారు. సత్వికులు, దార్మికులు అయిన వారు జన్మిస్తారు. శ్రాద్ధ కర్తలు తమ తండ్రులను వసువుల రూపంగాను, తాతలను రుద్రుని రూపంగాను, ముత్తాతలను ఆదిత్య రూపంగాను భావించి, విశ్వే దేవతలతో శ్రీ మహా విష్ణువును ఆరాధించాలి.

కృష్ణా పుష్కర సమయంలో పుష్కరునితో పాటు దేవతలు, పితృ దేవతలు, ఋషులు కృష్ణానదీ జలాల్లో సూక్ష్మరూపంలో ఉంటారు. కాబట్టి కృష్ణా పుష్కరములో పెట్టిన శ్రాద్ధము కోటి గుణిత ఫలము ఇస్తుంది.

కాబట్టి కృష్ణా పుష్కర పవిత్ర సమయంలో కృష్ణనదీ పూజ, బృహస్పతి పూజ పితృదేవతారాధన విశేష ఫలదాయకము. పితృ దేవతలకు చేసే శ్రాద్ధాలలో హిరణ్య శ్రాద్ధం, ఆమశ్రాద్ధం, అన్న శ్రాద్ధం, మొదలయినవున్నాయి. హిరణ్యమంటే ఇక్కడ ధనం, ఆమం అంటే ఉడికించని కూరలు, బియ్యం, పప్పు మొదలయిన పదార్థాలు అన్నం తెలిసినదే వాటితో చేసే శ్రద్ధాలకు ఆపేర్లు. పుష్కర యాత్రికులు పుష్కరాల మొదటి రోజున హిరణ్య శ్రాద్ధం, చివరిరోజున ఆమశ్రాద్ధం పెడతారు. నదీ తీరంలో ఉండేవారు అన్న శ్రాద్ధం చేస్తారు. ఇది సంప్రదాయం.

విలేకర్లు , అడ్వర్‌టైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు

కావలెను

నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలోని రాయపూడి నుంచి వెలువడుతున్న 'రాజధాని వార్తలు' తొలి తెలుగు మల్టీకలర్ వారపత్రికకు విలేకర్లు, అడ్వర్‌టైజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. వివరములకు సంప్రదించగలరు.

రాజధాని వార్తలు

E- mail : info@rajadhanivartalu.com
www.rajadhanivartalu.com
FB: facebook.com/rajadhaniv

cell
94406 62699,
96768 44442

Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622.